మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Circulated to Telangana
Published from Jagitial

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 1-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 || సంచిక: 64 Issue: 64




# మెస్సీ టాటా!

## జాతీయ జట్టుకు రిటైర్మెంట్

### ఫిఫా ఫైనల్ ఓటమి కలచివేసిందని లేఖ

### తండ్రి మరణంతో కుంగిపోయానని వెల్లడి



మెస్సీ కనిపిస్తే అభిమానులకు పూనకాలు..
బాల్ తట్టినా, గోల్ కొట్టినా కేరింతలు..
అతడి పాదాలకు మైదానమే మంత్రముగ్ధం..
అతడి డ్రిబ్లింగ్‌కు ప్రత్యర్థుల గుండెల్లో దడ..
ప్రత్యర్థి జట్టుపై దండయాత్రను ఇక చూడలేం..
అలాంటి ఉద్వేగాలు,
భావోద్వేగాలు స్పృశించలేం..
ఫుట్‌బాల్‌ను ఆటగానే కాకుండా
ఓ భావోద్వేగంగా మార్చిన
మాంత్రికుడు లియోనెల్
మెస్సీ.. తన కెరీర్‌కు
వీడ్కోలు పలికాడు.

(..మరిన్ని వివరాలు క్రీడావాణి పేజీలో..)



# 1000 పడగలు!

నెరవేరని
హామీల పడగ..
పార్టీలో విభేదాల పడగ..
పాలనలో అసంతృప్తి పడగ..
వెయ్యి రోజుల్లో ప్రభుత్వం
విజయాలెన్ని?
వాయిదా పడిన హామీలెన్ని?
అమలుకాని గ్యారెంటీలెన్ని?
ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఎంత?
వెయ్యి రోజుల పాలన..
వెయ్యి పడగలు..
బుసకొడితే తప్పదు మూల్యం!

## నేటితో కాంగ్రెస్ పాలనకు వెయ్యి రోజులు పూర్తి



### హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు వెనుకడుగు

ఆరు గ్యారెంటీల్లో కొన్నింటికే ఊరట.. కానరాని కీలక హామీలు

పార్టీలో అసమ్మతి.. మంత్రుల్లో సమన్వయ లోపం

'ఒంటెద్దు పోకడ'పై సొంత పార్టీ నుంచే ప్రశ్నలు

### రైతు, నిరుద్యోగి, మహిళ, పేద.. అన్ని వర్గాల్లో అసంతృప్తి స్వరాలు

(ఈవార్తలు - పొలిటికల్ బ్యూరో)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సెప్టెంబర్ 1తో 1,000 రోజులు. మార్పు కోసం ప్రజలు పట్టం కట్టిన ప్రభుత్వం.. హామీల అమలులో మాత్రం ఆశించిన వేగాన్ని అందుకోలేకపోయిందన్న విమర్శలు బలపడుతున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు -2 వ పేజీలో...

# రాష్ట్రపతి ఏడీసీ..

### మేజర్ రిషబ్ సింగ్ రిటైర్మెంట్.. 12 ఏళ్ల పాటు సైనిక సేవల్లో బాధ్యతలు

### రాష్ట్రపతి ముర్ము ఆశీస్సులు తీసుకున్న సాంబ్యాల్



భారత సైన్యంలో విశిష్ట సేవలు అందించి, సోషల్ మీడియాలో హీరోగా నిలిచిన మేజర్ రిషబ్ సింగ్ సాంబ్యాల్ ఆర్మీ సర్వీస్ నుంచి ముందస్తు రిటైర్మెంట్ తీసుకున్నారు. దాదాపు 12 ఏళ్ల పాటు సైనిక సేవల్లో కొనసాగిన ఆయన.. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఏడీసీ(అసిస్టెంట్-డి-క్యాంప్)గా బాధ్యతలు నిర్వర్తించారు.

న్యూఢిల్లీ: పదవి నుంచి వైదొలిగిన అనంతరం ఆయన రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదీ ముర్మును కలిసి ఆమె ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మార్గదర్శకత్వం, బోధనలు తన జీవితానికి ఎంతో ఉపయోగపడ్డాయని మేజర్ రిషబ్ తన తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15677 |
| వెండి (కిలో): | రూ.2,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,513 |

### విశ్వవాణి



గుండె కొట్టుకోవడం, శ్వాస ఆగిపోయిన వెంటనే మెదడు పనితీరు పనిచేయడం మానదని పరిశోధనలు సూచిస్తున్నాయి. వైద్యపరంగా మరణించిన కొద్దిసేపటి సమయంలో మెదడులో విద్యుత్ కార్యకలాపాలు కొనసాగడం వల్ల ఇలా జరుగుతోందని పరిశోధకులు తెలిపారు. ఈ పరిశోధన జీవితం ముగిసే సమయంలో మెదడులో జరిగే మార్పులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కేసీఆర్-నేను.. నంది-పంది!



### నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా

### నాతో కేసీఆర్‌కు పోలికనా?

### చెప్పులు మోసినోళ్లకు కేసీఆర్ పదవులు

### బడుగులకు పదవులు ఇచ్చింది రేవంత్

### సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

ప్రజాపాలనకు వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు కేసీఆర్‌కు నక్కకు.. నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు.

హైదరాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): చెంచాలు, చెప్పులు మోసిన వాళ్లకు కేసీఆర్ పదవులిస్తే..తాను బడుగు బలహీన వర్గాల వాళ్లకు పదవులిచ్చానని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అంబర్‌పేట్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతోతరువాయి 2 వ పేజీలో...



# ప్రశాంత్ రెడ్డి అంతం.. నా పంతం!

### హరీశ్, సంతోష్‌నైనా క్షమిస్తా

### కానీ, ప్రశాంత్ రెడ్డిని వదలను

### నా ఉసురు కచ్చితంగా తగులుతుంది

### నిజామాబాద్‌లో కవిత శపథం

బాల్కొండ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి అంతమే తన పంతం అని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత శపథం చేశారు. ఎవర్ని వదిలినా, ప్రశాంత్ రెడ్డిని వదిలే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై కవిత కన్నీళ్లు పెట్టుకున్నారు. పార్టీ మీద కక్షతోనే తనను జైలుకు పంపారని బీఆర్ఎస్ పెద్దలే చెప్పారని, ఆ తర్వాత బయటకు గెంటేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

నిజామాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె ప్రసంగిస్తూ.. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత మొదటిసారి నిజామాబాద్‌లో అడుగుపెట్టిన కవిత.. బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే, కంటతడి పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదని, ఇవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని కవిత చెప్పారు. 'ఆడబిడ్డలకు సత్యం గుండెల్లో ఉంటే.. కళ్లలో నుంచి నీళ్లొస్తాయి.. నీతి, ఉన్నోళ్లకు ఒక్కోసారి బాధ ఇలా తన్నుకొస్తుంది' అని అన్నారు. తరువాయి 2 వ పేజీలో...

## 15 వరకు చేయూత పింఛన్ల గడువు



హైదరాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగించింది. సెప్టెంబర్ 15వ తేదీ వరకు చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించిన తెలంగాణ సర్కారు.. చేయూత పథకం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్న -2 వ పేజీలో...

# వద్దు.. యుద్ధం

### ముగింపు పలకండి.. పుతిన్‌తో ప్రధాని మోదీ



బిష్కెక్: సుదీర్ఘంగా సాగుతోన్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ఉద్దేశించిన అన్ని ప్రయత్నాలకు భారతఓ మద్దతు ఇస్తుందని, భవిష్యత్తులో కూడా ఈ సాయం కొనసాగుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 'ఇది యుద్ధాల యుగం కాదు' అంటూ కొన్నేళ్ల కిందట చేసిన వ్యాఖ్యలను పునరుద్ఘాటిస్తూ, ఈ వివాదంపై భారత్ వైఖరిని మరోసారి ప్రపంచ వేదికపై గట్టిగా మోదీ వినిపించారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిగిన ద్వైపాక్షిక భేటీ అనంతరం ప్రధాని మోదీ ఈ ప్రకటన చేశారు. 'మనం 'ముగింపు లేని యుద్ధం' నుంచి 'యుద్ధ తరువాయి 2 వ పేజీలో...



# పేలిన ప్రాణాలు

### యూపీలో టపాసుల ఫ్యాక్టరీలో బాంబ్ బ్లాస్ట్.. 8 మంది చిన్నారులు సహా 11 మంది మృతి

కౌశాంబి: ఉత్తరప్రదేశ్‌లో సోమవారం ఘోర ప్రమాదం సంభవించింది. కౌశాంబి జిల్లాలో ఒక బాణాసంచా కర్మాగారంలో పేలుడు సంభవించి.. 11 మంది ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పిప్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మనోరి గ్రామంలో ఉన్న బాణాసంచా ఫ్యాక్టరీలో ఈ పేలుడు సంభవించినట్లు జిల్లా కలెక్టర్ అమిత్ పాల్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన 11 మందిని ప్రయాగ్‌రాజ్‌లోని SRN ఆసుపత్రికి తరలించగా, -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

1.9.2026

మేషం: కీలక సమయంలో ఆత్మీయుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ప్రశంసలు అందుతాయి. చాలకాలంగా పూర్తికాని పనులు పూర్తి చేస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి.

వృషభం: ఉద్యోగ ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి. ఇంటా బయట బాధ్యతలు ఒత్తిడికి గురిచేస్తాయి. నూతన రుణాలు చేయవలసి రావచ్చు. వ్యాపార విషయంలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. వృత్తి, వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు.

మిథునం: వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలు తప్పవు. ముఖ్యమైన పనులలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. దైవదర్శనం చేసుకుంటారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వ్యాపారమున సమస్యాత్మక వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: వ్యాపారాల విస్తరణకు అవరోధాలు తొలగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో జీతభత్యాలు విషయంలో అనుకూలత కలుగుతుంది. చిన్ననాటి మిత్రులతో విందువినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి మరింత పుంజుకుంటుంది.

సింహం: భూ సంబంధిత వివాదాలు మరింత చికాకు పరుస్తాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది. మానసిక చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ నిర్వహణలో లోపం వలన అధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

కన్య: చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక వృద్ధి,పాత ఋణాలు తీర్చగలుగుతారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహమున దైవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నిరుద్యోగులకు తగిన అవకాశాలు లభిస్తాయి.

తుల: ఉద్యోగమున అధికారులతో వాదాలకు వెళ్లకపోవడం మంచిది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. ఇంటాబయట సమస్యలు అధికమవుతాయి. వృత్తి వ్యాపారాలలో తొందరపడి సొంత నిర్ణయాలు తీసుకుని నష్టపడతారు.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాల్లో కార్యసిద్ధి కలుగుతుంది.వృత్తి,ఉద్యోగాల్లో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి . కీలక సమయంలో కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి.వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.ఆర్థిక వ్యవహారాలు సంతృప్తి కరంగా సాగుతాయి.సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

ధనస్సు: సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. మొండి బాకీలు వసూలవుతాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

మకరం: వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికామౌతుంది. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నూతన ఋణ యత్నాలు కలసిరావు. ఆర్థిక వ్యవహారాలు గందరగోళంగా ఉంటాయి. పుణ్యక్షేత్ర దర్శనాలు చేసుకుంటారు.

కుంభం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. చేపట్టిన పనులు వ్యయ ప్రయాసలుతో కాని పూర్తికావు. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ఇంటా బయట ప్రతికూల వాతావరణం ఉంటుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

మీనం: వ్యాపారపరంగా కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి, ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. నిరుద్యోగులకు అప్రయత్నంగా అవకాశములు అందుతాయి. కొన్ని వ్యవహారాలలో తీసుకున్న నిర్ణయాలు తరువాత కాలానికి ఉపయోగపడతాయి.

## ప్రశాంత్ రెడ్డి అంతం.. నా పంతం!

**మొదటి పేజీ తరువాయి**

ఆరు నెలలు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టిల్లు ఆదరించలేదని ఆవేదనకు గురయ్యారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా మాట్లాడకుండా కన్నబిడ్డలా కడుపులో పెట్టుకుని చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పూ చేయని తనను జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానని శపథం చేశారు. ఈ రాష్ట్రంలో చేయాల్సి ఉంది ఇంకా ఉందని, మారాల్సింది ఇంకా ఉందని సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని కవిత ఉద్ఘాటించారు. తండ్రిని, బిడ్డను వేరుచేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిదే కీలక పాత్ర అని, ఆయన శకుని పాత్ర పోషించారని దుయ్యబట్టారు. "హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో గానీ.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను.. ఆయనకు నా ఉసురు తగులుతుంది. ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ కొడుకులా చూసుకుంటే.. మా మధ్య ఆయన చిచ్చుపెట్టారు. కేసీఆర్ దిగిపోయిన రెండో రోజే ఆయన కాంగ్రెస్ పార్టీతో టచ్‌లోకి వెళ్లి అందులో చేరేందుకు సిద్ధమయ్యారు. అమెరికాలో నెల రోజులు ఉండి వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు జరిపారు" అని ఆరోపించారు. ప్రశాంత్ రెడ్డికి రాజకీయ భవిష్యత్తు లేదు.. బాల్కొండ నుంచి పారిపోవాలి. ఆయన వైఖరి పులిని చూసి నక్క వాతపెట్టుకున్న చందంగా ఉంది. ఆయన మంత్రి కావడానికి నేను ఎంతో సహాయం చేశా. ప్రశాంత్ రెడ్డి, జీవన్ రెడ్డి, బాజి రెడ్డి, ఆనాటి బోధన్ ఎమ్మెల్యేను గెలిపించడానికి చాలా కష్టపడ్డాను. కానీ, వారంతా నన్ను ఓడించారు" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ప్రాజెక్ట్ వల్ల నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ఆమె ప్రశ్నించారు. అంతేకాదు, దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వాళ్లను నిలదీయకుండా బీఆర్ఎస్ పార్టీ ఎందుకు వెనక్కి తగ్గుతోందని నిలదీశారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు.

## 15 వరకు చేయూత పింఛన్ల గడువు

**మొదటి పేజీ తరువాయి**

సంగతి తెలిసిందే. ఆగస్ట్ 9వ తేదీ నుంచి మొత్తం ఐదు కేటగిరీలలో పింఛన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ గడువు ఆగస్ట్ 31 ముగియగా.. ఇంకా దరఖాస్తు చేయని వారి అభ్యర్థనతో సెప్టెంబర్ 15వ తేదీ వరకూ గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దరఖాస్తుల ప్రక్రియ తర్వాత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు.. మిగతా చోట్ల బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేపడతారు. చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం ఆదివారం వరకు 4,34,854 మంది దరఖాస్తు చేసుకున్నారు.

# 10000 పడగలు!

**మొదటి పేజీ తరువాయి**



గ్యారెంటీలు, వందలాది హామీలను చూపిస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. పాలనలో కొన్నింటిని అమలు చేసినా, ప్రధానమైన హామీలన్నింటినీ పూర్తిస్థాయిలో, నిర్దిష్ట కాలపరిమితిలో అమలు చేయలేకపోయిందనే అసంతృప్తి విస్తరిస్తోంది. ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే వంటగ్యాస్ వంటి చర్యలు అమలయ్యాయి. రైతు రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాలపైనా ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసింది. అయినా.. మిగిలిన హామీలపై స్పష్టత, సంపూర్ణ అమలు, అర్హులందరికీ ప్రయోజనం అందడంపై ప్రశ్నలు కొనసాగుతున్నాయి.

కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన ఆయుధంగా మారిన ఆరు గ్యారెంటీలే ఇప్పుడు ప్రభుత్వానికి ప్రధాన పరీక్షగా మారాయి. మహాలక్ష్మి కింద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం.. రైతుభరోసా కింద రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం, వ్యవసాయ కూలీలకు సాయం, ధాన్యానికి రూ.500 బోనస్.. ఇందిరమ్మ ఇళ్లు.. యువ వికాసం.. చేయూత వంటి హామీలు కాంగ్రెస్ మేనిఫెస్టోలో కీలకంగా నిలిచాయి. వీటిలో ఉచిత బస్సు ప్రయాణం మాత్రం ప్రభుత్వానికి స్పష్టమైన విజయంగా నిలిచింది. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం 30 నెలల్లో ఈ పథకంపై సుమారు రూ.11 వేల కోట్లు ఖర్చు చేసింది. అయితే.. మహిళలకు నెలకు రూ.2,500, నిరుద్యోగులకు హామీ ఇచ్చిన భరోసా, విద్యా కార్డులు, అన్ని అర్హ కుటుంబాలకు ఇళ్ల హామీ వంటి అంశాల అమలుపై ప్రతిపక్షాలు తీవ్రంగా ప్రశ్నిస్తున్నాయి. "గ్యారెంటీ అంటే ఎన్నికల హామీనా? లేక అమలు చేయాల్సిన ప్రభుత్వ బాధ్యతా?" అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ చర్చగా మారింది.

### రైతుకు రుణమాఫీ.. కానీ!

రైతు రుణమాఫీని ప్రభుత్వం తన ప్రధాన విజయాల్లో ఒకటిగా చూపిస్తోంది. రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీతో 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు ఉపశమనం కలిగించామని ప్రభుత్వం చెబుతోంది. రైతుభరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అయితే ప్రతిపక్షాలు మాత్రం రుణమాఫీ మొత్తం రైతులందరికీ పూర్తిగా అందలేదని ఆరోపిస్తున్నాయి. ఆగస్టులో మాజీ మంత్రి హరీశ్‌రావు.. ప్రభుత్వం ప్రకటించిన కేటాయింపులు, వాస్తవంగా విడుదలైన నిధుల మధ్య వ్యత్యాసం ఉందని విమర్శించారు. ఇదే సమయంలో రైతు సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యాయని చెప్పే పరిస్థితి లేదన్న అభిప్రాయం రైతు సంఘాల నుంచి వినిపిస్తోంది. సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర, కౌలు రైతుల గుర్తింపు, వ్యవసాయ కూలీలకు హామీ ఇచ్చిన సాయం వంటి అంశాలు ఇంకా రాజకీయంగా సున్నితమైనవిగానే ఉన్నాయి.

### ఉద్యోగాలేవి?

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, యువ వికాసం ప్రధాన హామీలుగా నిలిచాయి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పరీక్షల నిర్వహణ, నియామక ప్రక్రియలో ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినా.. ప్రతి నిరుద్యోగి కుటుంబంలో కనిపించే ఆశకు తగ్గ స్థాయిలో ఉపాధి అవకాశాలు లభించలేదనే విమర్శ ఉంది. ఉద్యోగ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, విద్యా కార్డులు, అంతర్జాతీయ విద్యా అవకాశాల వంటి హామీలు కాంగ్రెస్ ప్రచారంలో పెద్ద స్థానం పొందాయి. కానీ వాటి అమలుపై స్పష్టత లేకపోవడం యువతలో అసంతృప్తికి కారణమవుతోందన్న విమర్శలు ఉన్నాయి.

### 'ఇందిరమ్మ' కోసం ఎదురుచూపులు

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. హైదరాబాద్‌లోనే లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా అర్హులందరికీ ఇళ్లు, ఇంటి స్థలాలు, నిర్మాణ సాయం అందే వరకు ఈ హామీ పూర్తయిందని చెప్పే పరిస్థితి లేదన్నది విమర్శకుల వాదన.పాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలతో ప్రత్యేక ముద్ర వేసింది. చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం హైడ్రా ఏర్పాటు చేయడం, ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వానికి ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. అయితే కూల్చివేతల విషయంలో చట్టపరమైన ప్రక్రియ, పేద--మధ్యతరగతి కుటుంబాలపై ప్రభావం వంటి అంశాలపై కూడా విమర్శలు వచ్చాయి.

### పార్టీలోనే 'వేయి' ప్రశ్నలు

ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయికి చేరుకున్న సమయంలో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరో సమస్యగా మారాయి. మంత్రి కొండా సురేఖ వ్యవహారం, ఆమె కుమార్తె వ్యాఖ్యలపై పార్టీ క్రమశిక్షణ చర్యల చర్చ, నేతల మధ్య ఆధిపత్య పోరు.. పార్టీ అంతర్గత సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తాయి. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో మంత్రివర్గ మార్పులు, అసమ్మతి అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యమంత్రి 2034 వరకు తానే కొనసాగుతానంటూ చేసిన వ్యాఖ్యలు కూడా కాంగ్రెస్‌లోని కొందరు నేతల్లో అసంతృప్తికి కారణమయ్యాయని వార్తలు వచ్చాయి. ముఖ్యమంత్రి ఎంపిక అధిష్ఠానం పరిధిలోని అంశమని కొందరు నేతలు వ్యాఖ్యానించినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలను వేగంగా తీసుకుంటున్నా.. సమిష్టి నిర్ణయ ప్రక్రియ కంటే ముఖ్యమంత్రి కేంద్రంగా పాలన సాగుతోందన్న విమర్శ ప్రతిపక్షాల నుంచే కాకుండా అప్పుడప్పుడు సొంత పార్టీ వర్గాల నుంచీ వినిపిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకత్వం మధ్య సమన్వయం లోపిస్తే దాని ప్రభావం ప్రభుత్వ పనితీరుపైనా పడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో బహిరంగంగా బయటపడుతున్న విభేదాలు ఈ అంశానికి మరింత ప్రాధాన్యం తెచ్చాయి.

### ఆంధ్ర విషయంలోనూ విమర్శలే..

రేవంత్ సర్కారుపై మరో రాజకీయ విమర్శ ఆంధ్రప్రదేశ్‌తో వ్యవహరించే తీరుపై ఉంది. ఏపీ సీఎం చంద్రబాబునాయుడితో సాన్నిహిత్యం, రెండు రాష్ట్రాల మధ్య విభజన సమస్యల పరిష్కారానికి చర్చల మార్గాన్ని ఎంచుకోవడాన్ని కొందరు స్వాగతిస్తుండగా.. తెలంగాణ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం మరింత కఠినంగా ఉండాల్సిందని విమర్శకులు అంటున్నారు.

### వెయ్యి రోజులు.. వేయి పడగలు!

వెయ్యి రోజులు పూర్తయ్యేసరికి రేవంత్ ప్రభుత్వానికి ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. విజయాలు లేకపోలేదు.. కానీ అవి హామీల భారాన్ని మోయడానికి సరిపోతున్నాయా? అన్నదే అసలు ప్రశ్న. రైతు రుణమాఫీ, ఉచిత బస్సు, రూ.500 గ్యాస్, రైతుభరోసా, హైడ్రా, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలను ప్రభుత్వం తన విజయాలుగా చూపిస్తోంది. అదే సమయంలో.. మహిళలకు రూ.2,500, నిరుద్యోగుల భరోసా, పూర్తి స్థాయి ఇందిరమ్మ ఇళ్ల అమలు, కౌలు రైతులు-వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు, ఇతర గ్యారెంటీల సంపూర్ణ అమలుపై ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. అందుకే సెప్టెంబర్ 1 కేవలం ప్రభుత్వానికి వెయ్యి రోజుల వేడుక కాదు.. ప్రజల తీర్పుకు ముందు జరిగే లెక్కల దినం.

## పేలిన పానాలు

**మొదటి పేజీ తరువాయి**

చికిత్స పొందుతూ వారు మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలతో అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. మృతుల్లో 8 మంది చిన్నారులే కావడం అత్యంత బాధాకరం. మృతులను ప్రియాంజలి (5), ప్రవీణ్ సింగ్ (13), జాహ్నవి (12), ఆదిత్య (12), ఆదిత్య (8), రవి (8), అంజు (32), జ్ఞాన్ సింగ్ (40), విక్రమ్ సరోజ్ (35), అంశ్ (6), నానా (4)లుగా గుర్తించినట్లు డీఎం వెల్లడించారు. వీరంతా ఫ్యాక్టరీ సమీపంలో నివసించేవారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో 18 మందికి పైగా గాయపడి ఉండవచ్చని భావిస్తున్నారు. మనోరి పవర్ హౌస్ సమీపంలో ఈ పేలుడు జరగడంతో ఫ్యాక్టరీతో పాటు చుట్టుపక్కల భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీకి ఆనుకుని ఉన్న దాదాపు ఆరు ఇళ్లు నేలమట్టమయ్యాయి. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఘటనా స్థలం సమీపం నుంచి వెళ్లే ఢిల్లీ-హౌరా రైల్వే లైన్‌లో రైళ్ల రాకపోకలను దాదాపు గంటపాటు నిలిపివేశారు. ప్రమాద స్థలం సమీపానికి చేరుకున్న అజ్మీర్-సీల్దా ఎక్స్‌ప్రెస్‌ను తిరిగి మనోరి రైల్వే స్టేషన్‌కు పంపగా, ఢిల్లీ నుంచి వారణాసి వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ముందు స్టేషన్‌లో నిలిపివేశారు. ఘటన గురించి సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ అమిత్ పాల్, కౌశాంబి ఎస్పీ సత్యనారాయణ ప్రజాపత్, ప్రయాగ్‌రాజ్ రేంజ్ ఐజీ అజయ్ మిశ్రాలు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ బ్రిగేడ్ బృందాలతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. డజనుకు పైగా ఫైర్ ఇంజన్లు, దాదాపు రెండు డజన్ల అంబులెన్సులను మోహరించారు. సమీపంలోని మనోరి ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి 50 మందికి పైగా వైమానిక దళ సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చిన అనంతరం సహాయక చర్యలు వేగవంతం చేశారు. పది జేసీబీలు, ఎక్స్కవేటర్లతో శిథిలాలను తొలగిస్తున్నారు. శిథిలాల కింద ఇంకా కొందరు చిక్కుకుని ఉండవచ్చని, దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ పేలుడు కారణంగా ప్రాంతంలో విద్యుత్ లైన్లు, స్తంభాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు. ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు తన సంతాపాన్ని తెలిపిన ఆయన.. బాధితులకు ఆర్థిక సాయాన్ని కూడా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ఆర్థిక సహాయం అందించాలని అధికారులకు సూచించారు.

## వద్దు.. యుద్ధం

**మొదటి పేజీ తరువాయి**

ముగింపు' వైపు పయనించాలి... ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలన్నదే సమస్త మానవాళి కోరిక" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 'ఉక్రెయిన్ అంశంపై మనం నిరంతరం చర్చిస్తూనే ఉన్నాం.. గతంలో మనం కలుసుకున్నప్పుడు కూడా మీరు అక్కడి పరిస్థితిని నాకు వివరంగా వివరించారు.. మీకు తెలిసినట్లుగానే సంక్షోభానికి ముగింపు పలికే ప్రతి శాంతియుత మార్గానికి భారత్ మద్దతు ఇస్తుంది. మానవాళి శ్రేయస్సు కోసం అన్ని సమస్యలను శాంతియుత చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ వకాల్తా పుచ్చుకుంటోంది' అని మోదీ పేర్కొన్నారు. 2022లో కూడా ఎస్‌సీఓ సమావేశం సందర్భంగానే అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయిన ప్రధాని మోదీ, 'ఇది యుద్ధాల యుగం కాదు' అని వ్యాఖ్యానించారు. అప్పట్లో మోదీ చేసిన ఆ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా చర్చనీయాంశమయ్యాయి. రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులు పుతిన్, వోలిడిమిర్ జెలెన్స్కీలతో జరిపిన సంభాషణల్లో భారత్ మొదటి నుంచీ దౌత్యం, చర్చల అవసరాన్ని నొక్కి చెబుతూనే ఉంది. భారతదేశాన్ని బుద్ధుడు, గాంధీ నడిచిన నేలగా అభివర్ణిస్తూ.. "సహానుభూతి అనేది భారతీయుల గుర్తింపు లక్షణాలలో ఒకటి. ఏ దేశంలోనైనా ఏదైనా కష్టం వస్తే ముందుగా సహాయం అందించేది తొలి దేశం భారత్... భారత్ ముందు నుంచి బుద్ధుని సంప్రదాయాన్ని విశ్వసిస్తుంది.. కాబట్టి యుద్ధాన్ని కాకుండా శాంతిని నమ్ముతుంది... ఈ ప్రాంతంలో శాంతికి భారత్ మద్దతుదారుగా ఉంది.. " అని తెలిపారు. "ఈ ప్రాంతంలో శాశ్వత శాంతి నెలకొనాలనేదే భారత ఆకాంక్ష.. మా వైఖరి స్పష్టం.. ఇది యుద్ధాలు చేసుకునే సమయం కాదు. మానవాళికి ముప్పుగా పరిణమిస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు అందరం కలిసికట్టుగా నిలవాల్సిన సమయమిది. యుద్ధం జరిగే ప్రతి రోజు మానవాళిని వెనక్కి నెడుతుంది. అందుకే భారత్ దౌత్యం, చర్చల విధానాన్నే బలంగా నమ్ముతుంది" అని స్పష్టం చేశారు. వచ్చే వారం న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు రానున్న నేపథ్యంలో ఈ ద్వైపాక్షిక భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

## రాష్ట్రపతి ఏడీసీ..

**మొదటి పేజీ తరువాయి**

సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. మేజర్ రిషబ్ సింగ్ సాంబ్యాల్ సైనిక ప్రయాణం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సాగింది. 2013లో ఎన్‌డీఏ(నేషనల్ డిఫెన్స్ అకాడమీ) పరీక్షలో ఉత్తీర్ణులై 2014లో శిక్షణ ప్రారంభించిన ఆయన.. ఇండియన్ మిలిటరీ అకాడమీలో డిఫెన్స్ మేనేజ్మెంట్ విద్యను అభ్యసించారు. 2021 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో 'జాట్ రెజిమెంట్' దళానికి కెప్టెన్ గా నాయకత్వం వహించి 'బెస్ట్ మార్చింగ్ కాంటింజెంట్' ట్రోఫీని గెలుచుకున్నారు. ఆ తర్వాత ఆర్మీకి చెందిన అత్యంత కఠినమైన '4 పారా స్పెషల్ ఫోర్సెస్'లో పనిచేసి ప్రతిష్ఠాత్మకమైన 'బలిదాన్ బ్యాడ్జ్'ను కూడా సాధించారు. మార్చి 2023లో భారత రాష్ట్రపతి ఏడీసీగా ఎంపికైన రిషబ్ సింగ్ సాంబ్యాల్ నాటి నుంచి ద్రౌపదీ ముర్ము అధికారిక కార్యక్రమాలు, విదేశీ పర్యటనలు, పరేడల్లో ఆమె వెంట ఉంటూ ప్రోటోకాల్, భద్రతా వ్యవహారాలు చూసుకునేవారు. రాష్ట్రపతి పక్కన ఆయన కనిపించే తీరు, సైనిక క్రమశిక్షణ, హుందాతనం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## కేసీఆర్-నేను.. నంది-పంది!

**మొదటి పేజీ తరువాయి**

మోసం చేశారని రేవంత్ మండిపడ్డారు. మూసీ పక్కన నివసించే పేదల దయనీయ పరిస్థితిని పట్టించుకోలేదన్న ఆయన.. తాము మాత్రం ఎక్కడ ఉన్నవారికే అక్కడే ఇళ్లు కట్టించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇక బతుకమ్మ కుంటను చెరబట్టిన వారి వెనుక ఎవరి హస్తం ఉందో ప్రజలకు తెలుసన్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట - మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై నూతనంగా నిర్మించిన వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల పాలనలో సాధ్యం కాని పనులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే పూర్తి చేసి చూపిందని పేర్కొన్నారు. వర్షం వస్తే మునిగిపోయే పాత వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలని పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు ఆలోచించలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సరైన ప్రభుత్వ కార్యాలయాలు లేవని, స్థానిక ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ప్రభుత్వ భవనాలను నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా, 10 ఎకరాల స్థలంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించారు. బతుకమ్మ కుంట కబ్జాకు పాల్పడుతున్న వారి వెనుక ఎవరి హస్తముందో ప్రజలు గమనించాలని ఆయన కోరారు. తాము బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, కనీసం ఏడో తేదీ వచ్చినా ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దయనీయ స్థితి నెలకొని ఉండేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలించిన 16 మంది ముఖ్యమంత్రులు కలిసి కేవలం రూ. 70 వేల కోట్లు అప్పు చేస్తే, కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. తమ ప్రభుత్వం చెరువులను కబ్జా చేసి విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించడం లేదని, కేవలం ఆక్రమణలను తొలగించి జలవనరులను కాపాడుతోందని స్పష్టం చేశారు. గతంలో తనను విమర్శించిన ఉద్యోగులే ఇప్పుడు తమ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు.

## టాక్సిక్'లో అవేం సీన్లు.. మధ్యలోనే వచ్చేశా: రాజాసింగ్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకొచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర విమర్శలు చేశారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదేం అశ్లీలత అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. సినీ పరిశ్రమ సమాజానికి ఉపయోగపడే మంచి సందేశాత్మక చిత్రాలు తీయాలని రాజాసింగ్ సూచించారు. దర్శకులు హింస, అశ్లీలతను మాత్రమే నమ్ముకోకుండా సమాజాన్ని దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. ధర్మం, భక్తి పెంపొందించేలా సినిమాలు రూపొందించాలని పిలుపునిచ్చారు. టాక్సిక్ సినిమా చూడటానికి తాను థియేటర్‌కు వెళ్లానని రాజాసింగ్ తెలిపారు. అయితే సినిమాలోని అశ్లీలత, తీవ్ర హింసను భరించలేక మధ్యలోనే బయటకు వచ్చేశానని చెప్పారు. యశ్ వంటి అగ్ర కథానాయకులు కుటుంబంతో కలిసి చూసేలా మంచి సినిమాలు చేయాలని సూచించారు. సమాజంలో ధర్మం, భక్తి, బాధ్యత పెంచే చిత్రాలు అవసరమని రాజాసింగ్ అన్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి', 'ఛావా' సినిమాలను ఆయన ఉదాహరణగా చెప్పారు. 'ఇరుముడి'లో ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యత కనిపిస్తాయని ప్రశంసించారు. 'ఛావా'లో ధైర్యం, దేశభక్తి వంటి అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే 'టాక్సిక్' విడుదలైన తొలిరోజే నెగెటివ్ టాక్ తెచ్చుకుంది. అయినప్పటికీ వసూళ్ల పరంగా సినిమా మంచి ఫలితాలు సాధిస్తుండటం గమనార్హం.

## మంత్రులకు స్వేచ్ఛ ఏది?

**ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవు**

**సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

హైదరాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని అన్నారు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అధికారం, హక్కులతో పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు చేయడం సహజమేనని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో భూ సమస్యలపైనా కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## విత్తన గణేశుడిని పూజించండి

**వినాయక చవితి వేళ భక్తులకు చిరంజీవి పిలుపు**

హైదరాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు కోసం ఈసారి సీడ్ గణేశుడిని పూజించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణేశుడిని పూజించిన తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేస్తే.. ఆ విత్తనాల నుంచి మొక్కలు పెరిగి భవిష్యత్తులో మనల్ని ఆశీర్వదిస్తాయని తెలిపారు. 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' రూపొందించిన సీడ్ గణేశుడి ప్రతిమలను చిరంజీవి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను ఓ యజ్ఞంలా భావించి సంతోష్ కుమార్ పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఇప్పటికే లక్షల మందిని ప్రోత్సహించి 20 కోట్ల మొక్కలు నాటేలా చేయడం అభినందనీయమన్నారు. పచ్చదనం పెంపు కోసం ఆయన చేస్తున్న కృషికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.

## జీహెచ్ఎంసీకి కొత్త లోగో

హైదరాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం మూసారాంబాగ్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కీలక మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన నూతన లోగోలను సీఎం అధికారికంగా ఆవిష్కరించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం ఇటీవల జీహెచ్ఎంసీ నుంచి రెండు కొత్త కార్పొరేషన్లను వేరు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన లోగోలను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సుదీర్ఘమైన పదేళ్ల కాలం తర్వాత జీహెచ్ఎంసీకి రూపుదిద్దిన కొత్త లోగో నగరవాసుల దృష్టిని ఆకర్షిస్తోంది. నగర విస్తరణకు అనుగుణంగా పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికే ఈ కార్పొరేషన్ల విభజన, నూతన గుర్తింపులను తీసుకువచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెండ్రోజులు పులివెందులలో జగన్ పర్యటన

పులివెందుల, ఆగస్టు 31 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. వర్ధంతి కార్యక్రమం పూర్తయిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రతీ ఏటా వైఎస్సార్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలకు జగన్ హాజరై నివాళులు అర్పించడం తెలిసిందే.



# పుస్తకాలు లేకుండానే బడికి

## ప్రభుత్వ బడుల్లో నో బ్యాగ్ డే.. క్రియేటివిటీకి ఛాన్స్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు తీపి కబురు. పుస్తకాల మోత తప్పేలా విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. చదువు అంటే కేవలం క్లాసులు వినడం, హోంవర్క్‌లు రాయడమే కాదని విద్యార్థుల్లో దాగి ఉన్న హిడెన్ టాలెంట్‌ను వెలికితీసేందుకు 'టెన్ బ్యాగ్ లెస్ డేస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2026–27 అకడమిక్ ఇయర్‌కు సంబంధించి ఒకటో తరగతి నుంచి టెన్త్ క్లాస్ వరకూ ఈ నూతన విధానాన్ని అమలు చేసేలా తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విద్యార్థులకు చదువు భారం కాకుండా ఆనందకరంగా మార్చే ఉద్దేశంతో ఈ విధానాన్ని తీసుకువచ్చారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 10 రోజులను నో బ్యాగ్ డే కోసం కేటాయించారు. సాధారణంగా ప్రతి నెలా మూడో శనివారం రోజున ఈ బ్యాగ్ లెస్ డే కొనసాగనుంది. 2026 సెప్టెంబర్ నుంచి 2027 మార్చి వరకు నిర్వహించాల్సిన తేదీలను కూడా విద్యాశాఖ ఇప్పటికే ఫైనల్ చేసింది. 2026లో సెప్టెంబర్ 19, నవంబర్ 21, డిసెంబర్ 19, 2027లో ఫిబ్రవరి 20, మార్చి 20, తేదీలను ప్రత్యేకంగా ప్రకటించింది. ఆయా రోజుల్లో విద్యార్థులు ఎలాంటి పుస్తకాల బ్యాగులు లేకుండానే బడికి హాజరు కావాల్సి ఉంటుంది. మిగతా రోజులను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తరగతులు నిర్వహించుకోవాలని సూచించారు. పుస్తకాలు లేని ఈ ప్రత్యేక రోజుల్లో ప్రత్యేకంగా రూపొందించిన మాడ్యూల్ ఆధారంగా సరికొత్త అభ్యాస పద్ధతులు అమలవుతాయి. విహారయాత్రలు, క్విజ్‌లు, బాలసభలు, చిత్రలేఖనం, నాటికలు, సైన్స్ ప్రయోగాలు, స్థానిక చేతివృత్తులవారితో ఇంటరాక్షన్‌లాంటి విభిన్న సృజనాత్మక కృత్యాల ద్వారా బడి పిల్లలకు కొత్త విషయాలను నేర్పించనున్నారు. ఈ విధానం వల్ల పిల్లల్లో కేవలం సబ్జెక్ట్ నైపుణ్యాలే కాకుండా పరిశీలన, ఆచరణాత్మక ఆలోచనలు, లీడర్‌షిప్ క్వాలిటీస్ పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. బ్యాగ్ లెస్ డేను తెలంగాణ వ్యాప్తంగా పకడ్బందీగా అమలయ్యేలా చూసే పూర్తి బాధ్యతను ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈఓలతోపాటు ఆయా స్కూళ్ల హెడ్మాస్టర్లు, టీచర్లపై పెట్టారు. స్కూల్ లెవెల్‌లో ప్రత్యేక వార్షిక ప్రణాళిక రూపొందించుకోవాలని ఇప్పటికే వారికి సూచించారు. ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులైన పిల్లలు సైతం ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా భాగస్వామ్యం అయ్యేలా చూడాలని, అవుట్‌డోర్ ట్రిప్స్ సమయంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కాగా, ఈ కొత్త విధానంపై స్టూడెంట్లు, పేరెంట్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పహల్గాం కేసు పేరుతో 4 నెలలు డిజిటల్ అరెస్ట్

**వృద్ధ దంపతుల నుంచి**

**రూ.64 లక్షలు కాజేసిన కేటుగాళ్లు**




హైదరాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో తరహా కొత్త మోసంతో అమాయకులను ఈజీగా బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ నగరానికి చెందిన వృద్ధ దంపతులను నాలుగు నెలల పాటు డిజిటల్ అరెస్ట్‌లో ఉంచిన సైబర్ మోసగాళ్లు.. పహల్గాం ఉగ్రదాడి కేసుతో సంబంధం ఉందంటూ బెదిరించి రూ.64 లక్షలు కాజేశారు. తాము మోసపోయామని గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. నాలుగు నెలల క్రితం ఆయనకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. క్రెడిట్ కార్డు బకాయిలు చెల్లించాల్సి ఉందని అవతలి వ్యక్తి చెప్పాడు. తనకు ఎలాంటి క్రెడిట్ కార్డు లేదని వృద్ధుడు సమాధానం ఇవ్వడంతో.. ఆ తర్వాత కొద్దిసేపటికే వాట్సాప్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఐపీఎస్ అధికారినంటూ పరిచయం చేసుకున్నాడు. బాధితుడి పేరు పహల్గాం ఉగ్రదాడి కేసుకు సంబంధించిన దర్యాప్తులో బయటపడిందని బయపెట్టాడు. దీంతో బాధితుడు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అనంతరం మోసగాళ్లు పదేపదే ఫోన్ చేస్తూ.. దర్యాప్తు పేరుతో తాము చెప్పింది చెప్పినట్లు చేసేలా ఒత్తిడి తెచ్చారు. సైబర్ నేరగాళ్ల కేటుగాళ్లు బాధితుడి కుటుంబానికి సంబంధించిన కీలక వివరాలను కూడా చెప్పడంతో వారు నిజమైన అధికారులుగా నమ్మాడు. అమెరికాలో నివసిస్తున్న మనవడి వివరాలతోపాటు ఉద్యోగానికి వెళ్లే మనవరాలి రోజువారీ ప్రయాణ మార్గం గురించి కూడా వారు ప్రస్తావించారు. దీంతో తమను అధికారులు నిఘాలో ఉంచారని వృద్ధ దంపతులు భావించారు. ఇదే భయాన్ని ఆసరాగా చేసుకున్న సైబర్ కేటుగాళ్లు.. వారిని డిజిటల్ అరెస్ట్ పేరుతో ట్రాప్ చేశారు. తమ అనుమతి లేకుండా ఎవరినీ సంప్రదించవద్దని, బయటకు వెళ్లవద్దని ఆదేశించారు. తాము చెప్పిన సూచనలు పాటించకపోతే కుటుంబ సభ్యులను డ్రగ్స్ కేసులో ఇరికిస్తామని బెదిరించారు. దర్యాప్తు, బ్యాంకు ఖాతా వెరిఫికేషన్ తదితర కారణాలను చూపుతూ నిందితులు బాధితుడి నుంచి పలుమార్లు నగదు బదిలీ చేయించుకున్నారు. విచారణలో భాగంగానే డబ్బును తాత్కాలికంగా బదిలీ చేయాలని, ఖాతాలను పరిశీలించిన తర్వాత తిరిగి ఇస్తామని నమ్మించారు. వారి బెదిరింపుల కారణంగా వృద్ధుడు దశలవారీగా భారీ మొత్తాన్ని బదిలీ చేశాడు. ఇలా మొత్తం రూ.64 లక్షలు వారి ఖాతాల్లో జమయ్యాయి. నాలుగు నెలల గడిచినా వేధింపులు ఆగకపోవటంతో బాధితుడు తాము మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కాల్స్, వాట్సాప్ కమ్యూనికేషన్, బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నారు. పోలీసులు, సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ లేదా ఇతర దర్యాప్తు సంస్థల పేరుతో ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని ఎవరైనా బెదిరిస్తే నమ్మవద్దని సైబర్ క్రైం అధికారులు సూచిస్తున్నారు. చట్టంలో డిజిటల్ అరెస్ట్ అనే విధానం లేదని, ఇలాంటి బెదిరింపులకు గురైతే వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

# వైఎస్ బాటలో నా పయనం

**త్వరలోనే సంచలన నిర్ణయం**

**వైసీపీ ఎన్నారైలతో రాజగోపాల్ రెడ్డి**



హైదరాబాద్, ఆగస్టు 31 (ఈవార్తలు): కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మార్పు దిశగా త్వరలోనే కీలక నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. వైఎస్సార్సీపీ ఎన్నారై విభాగం ఎక్స్ లో నిర్వహించిన స్పేస్ లో రాజగోపాల్ రెడ్డి మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమ పంథాలోనే తన భవిష్యత్ రాజకీయ ప్రయాణం సాగుతుందని తేల్చిచెప్పారు. మార్పు ఆలోచనతోనే కొన్ని నెలలుగా రేవంత్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిర్భయంగా ఖండిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పూర్తిగా పక్కదారి పడుతున్నాయని, ఈ తరుణంలో మార్పు దిశగా బలమైన అడుగులు వేయాల్సిన అవసరం వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రజలకు మేలు చేసే ఒక బలమైన రాజకీయ వేదికను పునర్నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నానని చెప్పారు. గత వైఎస్సార్ స్వర్ణయుగాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా త్వరలోనే ఒక సంచలనాత్మక నిర్ణయంతో కూడిన ప్రజా రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధన కోసం తెలంగాణ గడ్డపై వైఎస్ఆర్‌సీపీని తిరిగి బలోపేతం చేసి, రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో కచ్చితంగా విప్లవాత్మకమైన మార్పు తీసుకువస్తానని చెప్పారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలతో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. రైతుబంధు వంటి పథకాలతో ప్రజలకు ఓ వైపు డబ్బులు ఇస్తూనే, మరోవైపు గ్రామాల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులతో వాటిని తిరిగి ప్రభుత్వమే తీసుకుంటోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా సకాలంలో చెల్లించడం లేదని మండిపడ్డారు. అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాజగోపాల్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవినీతి ఎక్కువగా ఉందన్నారు. డబ్బులు సంపాదించడానికి మాత్రమే రాజకీయాల్లోకి వచ్చిన వారు ఎక్కువ కాలం ఉండలేరని రాజగోపాల్ రెడ్డి అన్నారు. వ్యాపారం చేసుకోవాలంటే బిజినెస్ లోనే ఉండాలి కానీ రాజకీయాలను వ్యాపారంగా మార్చకూడదన్నారు. తెలంగాణ రాజకీయాల్లో సంచలన నిర్ణయం తీసుకుంటానన్న రాజగోపాల్ రెడ్డి, త్వరలోనే రాజకీయ కార్యచరణ ప్రకటిస్తానని చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తెచ్చేలా ఆ నిర్ణయం ఉంటుందన్నారు. కొన్ని రోజులుగా సొంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తాజాగా చేసిన ఈ కామెంట్స్ హాట్ టాపిక్ గా మారాయి.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## సర్కారు బడుల మూతకు కాంగ్రెస్ కుట్ర

**రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు 15% కమీషన్ : హరీశ్ రావు**

సిద్దిపేట, ఆగస్టు 31 (ఈవార్తలు): సర్కారు బడుల మూతకు కాంగ్రెస్ సర్కారు కుట్ర పన్నుతోందని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా తడ్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జోగు వెంకటేశం పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడానికి మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని తెచ్చాం. మొదటి విడతలోనే తడ్కపల్లి స్కూల్‌ను ఎంపిక చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. డిజిటల్ క్లాసులు, డ్యూయల్ డెస్క్‌లు, డైనింగ్ హాల్, తాగునీరు, టాయిలెట్స్ ఇలా అన్ని వసతులు కల్పించాం. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ కార్యక్రమాన్ని ఆపేసింది. గత మూడేళ్లలో రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క కొత్త క్లాస్ రూమ్ కట్టిందా..? అని నేను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. రాష్ట్రంలో 27,000 పాఠశాలలను కేవలం 4,000 పాఠశాలలకు తగ్గిస్తామని సాక్షాత్తూ ముఖ్యమంత్రే చెబుతున్నారు. అంటే బడులను మూసేస్తారా..? ఒకపక్క ఉపాధ్యాయులు ప్రతి నెలా రిటైర్ అవుతున్నారు. వారి స్థానంలో కొత్త టీచర్లను భర్తీ చేయడం లేదు. డీఎస్సీ వేయరు, కనీసం విద్యా వాలంటీర్లనైనా పెట్టుకునే అవకాశం ఇవ్వరు. కేవలం సర్దుబాట్లు, డిప్యూటేషన్ల పేరుతో కాలం వెళ్లదీస్తుండటంతో ప్రభుత్వ బడుల్లో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. తక్షణమే డీఎస్సీ నిర్వహించి తీరాలి, ఆలోపు విద్యా వాలంటీర్లను నియమించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి. పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్లకు 2024 నుంచి ఇప్పటివరకు సరిగ్గా జీతాలు ఇవ్వలేదు. నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో పెడితే వాళ్లు ఎలా బతకాలి. హెడ్ మాస్టర్లు జేబులోంచి ఇచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జీవితకాలం పనిచేసి రిటైర్ అవుతున్న ఉద్యోగులకు వారు సొంతంగా దాచుకున్న జీపీఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ముప్పుతిప్పలు పెడుతోంది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావాలంటే 15% కమీషన్ లంచంగా ఇచ్చుకోవాల్సి వస్తోందని ఓ ఉపాధ్యాయురాలు కన్నీళ్లు పెట్టుకున్న వీడియోను మనమంతా చూశాం. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ ఊసే లేదు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తెస్తామని ఎన్నికల్లో చెప్పి.. మూడేళ్లయినా కనీసం ఒక కమిటీ వేయలేదు, చర్చలు జరపలేదు.

## చిలకలూరిపేట ప్రమాద మృతుల కుటుంబాలకు 10 లక్షలు

చిలకలూరిపేట, ఆగస్టు 31 (ఈవార్తలు): ఏపీలోని పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా నిలిచారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన చిలకలూరిపేట సమీపంలో ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జయి, అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిలకలూరిపేట మండలం, వేలూరు గ్రామానికి చెందినవారని అధికారులు గుర్తించారు.

# జగిత్యాల జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

**సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు అమల్లో**

**ధర్నాలు, రాస్తారోకోలకు అనుమతి కచ్చితం**

జగిత్యాల, ఆగస్టు 31 (ఈవార్తలు): జగిత్యాలలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జగిత్యాల జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్-1861ను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించరాదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడరాదని హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ అమలుకు జిల్లా ప్రజలు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పోలీసు సిబ్బందికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.




# వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడిగా ఆకుబత్తిని శ్రీనివాస్

జగిత్యాల, ఆగస్టు 31 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ వస్త్ర వ్యాపార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆకుబత్తిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సాముల నరేష్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు నందయ్య, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి తదితరులు హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆకుబత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ వస్త్ర వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘ సభ్యులందరినీ కలుపుకొని వ్యాపార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



# మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా తూడి లచ్చన్న

గంగాధర, ఆగస్టు 31 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని మల్లాపూర్ ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ నూతన చైర్మన్‌గా తూడి లచ్చన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు హాజరై ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, లచ్చన్నకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, మత్స్యకారులు ఆయనను అభినందించారు. సంఘం అభివృద్ధితో పాటు మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని తూడి లచ్చన్న తెలిపారు.



# సరైన పత్రాల్లేని 16 వాహనాలు సీజ్

జగిత్యాల టౌన్, ఆగస్టు 31 (ఈవార్తలు): జగిత్యాల మండల కేంద్రంలోని బస్ డిపో సమీపంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రోడ్ ట్యాక్స్, వాహన ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను అధికారులు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 16 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీటీవో సందని మహమ్మద్ మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తప్పనిసరిగా సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహన తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు రామారావు, సాయి చరణ్, శ్రీనివాస్, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వాహన మరమ్మతుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం!

**వాహనాలు నడవకున్నా నడిచినట్లు చూపిస్తున్నారంటూ కౌన్సిలర్ల ఆరోపణలు**

జగిత్యాల, ఆగస్టు 31 (ఈవార్తలు): వాహన మరమ్మతుల పేరుతో మున్సిపాలిటీలో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని 15వ వార్డు కౌన్సిలర్ అల్లాల సరిత-రమేష్‌రావు, 50వ వార్డు కౌన్సిలర్ ములస్తం లావణ్య-మహేష్ ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ సమావేశంలో శానిటేషన్ విభాగం వాహనాలపై పలు అంశాలను ప్రస్తావించారు. జూలై నెలలో డీజిల్ ఖర్చు రూ.11.83 లక్షలు చూపించారని, గత నెలతో పోలిస్తే రూ.2.20 లక్షలు అదనంగా ఖర్చు కావడంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనాలు నడవకున్నా నడిచినట్లు చూపిస్తూ, చిన్నపాటి మరమ్మతులకు లక్షల్లో బిల్లులు పెడుతున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీలో మెకానిక్ ఉన్నప్పటికీ బయట రిపేర్ల పేరుతో ఖర్చులు చూపించడంపై ప్రశ్నించారు. జియో ట్యాగింగ్‌కు రూ.9 లక్షలు ఖర్చు చేసినా కొన్ని వాహనాలకే ట్యాగింగ్ ఉండటంపై అనుమానాలు వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో 294 మంది కార్మికులు ఉన్నప్పటికీ పనిచేసిన వారికి జీతాలు అందకపోవడం, పనిచేయని వారికి పూర్తి జీతాలు వస్తున్నట్లు ఆరోపించారు. కొందరికే బయోమెట్రిక్ హాజరు అమలు చేయడం సరికాదన్నారు. చింతకుంట చెరువులోకి మురుగు నీరు చేరడంతో నీరు కలుషితమై చేపలు మృతి చెందుతున్నాయని, మత్స్యకార కుటుంబాలు నష్టపోతున్నాయని తెలిపారు. గణపతి, బతుకమ్మ నిమజ్జనాలకు ఉపయోగించే చెరువును పరిరక్షించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అవినీతికి తావులేకుండా మున్సిపల్ పనులు పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.



# కాలుష్య రహిత ఇంధనానికి ఊతం

**హైదరాబాద్‌లో బీఆర్ఈ సమ్మిట్ రోడ్‌షో**

హైదరాబాద్, ఆగస్టు 31 (పీఐబీ): దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన రంగాన్ని ప్రోత్సహించే 'భారత పునరుత్పాదక ఇంధన సమ్మిట్ అండ్ ఎక్స్‌పో-2026'లో భాగంగా హైదరాబాద్‌లో మూడో ప్రాంతీయ రోడ్‌షో నిర్వహించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నవంబరు 2 నుంచి 5 వరకు జరగనున్న ఈ సదస్సుకు ముందు జైపూర్, ముంబయిలో రోడ్‌షోలు నిర్వహించగా, తదుపరి కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలను జాతీయ స్థాయిలో ప్రదర్శించడంతోపాటు ప్రభుత్వ, పారిశ్రామిక, పెట్టుబడి రంగాల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకురావడం రోడ్‌షో లక్ష్యంగా పెట్టుకున్నారు. పునరుత్పాదక ఇంధన విస్తరణ, సాంకేతికత, తయారీ, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, పెట్టుబడులపై చర్చలు జరిగాయి. 2030 నాటికి దేశం 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతోందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ప్రతినిధులు తెలిపారు. దేశ శిలాజేతర ఇంధన స్థాపిత సామర్థ్యం ఇప్పటికే 300 గిగావాట్లను దాటిందన్నారు. ఇకపై కేవలం విద్యుత్ ఉత్పత్తి పెంపుపైనే కాకుండా ప్రసారం, ఇంధన నిల్వ, తయారీ, గ్రీన్ హైడ్రోజన్, డిజిటల్ సాంకేతికతలు, విద్యుత్ నిర్వహణ వంటి రంగాలపై దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫరూఖీ మాట్లాడుతూ పరిశుద్ధ, హరిత ఇంధన విధానం-2025 ద్వారా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, పరిశుద్ధ ఇంధన తయారీకి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులు, తయారీదారులు, పరిశ్రమలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ 2029 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని జోడించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని ఆ రాష్ట్ర ప్రతినిధి కమలాకర్ బాబు తెలిపారు. పునరుత్పాదక ఇంధనం, నిల్వ, గ్రీన్ హైడ్రోజన్, జీవ ఇంధనాలు, పరిశుద్ధ ఇంధన తయారీ వంటి రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలున్నాయని వివరించారు. తమిళనాడు ప్రతినిధి బి. రాజేశ్వరి మాట్లాడుతూ పవన, సౌర విద్యుత్ రంగాల్లో రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని వివరించారు. ఇంధన నిల్వ, పంప్డ్-స్టోరేజ్ ప్రాజెక్టులకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. సౌర విద్యుత్ పరికరాల తయారీ, విద్యుత్ ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, నిల్వ సాంకేతికతలు, ఎలక్ట్రోలైజర్లు, గ్రీన్ హైడ్రోజన్, విద్యుత్ గ్రిడ్ సాంకేతికతలు, కృత్రిమ మేధ ఆధారిత అంచనాలు, విద్యుత్ వాహనాలు, జీవ ఇంధనాలు తదితర రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని కేంద్ర అధికారులు తెలిపారు. మూడు రాష్ట్రాలు తమ పునరుత్పాదక ఇంధన ప్రణాళికలు, పెట్టుబడి అవకాశాలను బీఆర్ఈ సమ్మిట్-2026లో ప్రపంచానికి ప్రదర్శించాలని సూచించారు.




# ఇక చర్చలు లేవు.. సమరమే!

**పీఆర్సీ-ఓపీఎస్ అమలే లక్ష్యం.. సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్‌కు పిలుపు**

కరీంనగర్, ఆగస్టు 31 (ఈవార్తలు): మూడు సంవత్సరాలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం వినతులు, విన్నపాలు, చర్చలు జరిపినా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందించలేదని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇక చర్చలు చాలాయని, న్యాయమైన హక్కుల సాధన కోసం సమరానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "పెన్షన్ బిక్ష కాదు.. ఉద్యోగి హక్కు" అని పేర్కొన్నారు. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి వృద్ధాప్యంలో నిర్దిష్ట పెన్షన్ భద్రత లేకపోవడం ఆందోళనకరమన్నారు. 2018 పీఆర్సీ కాలపరిమితి 2023లో ముగిసినా కొత్త పీఆర్సీ కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ధరలకు అనుగుణంగా పీఆర్సీ అమలు చేయడంతో పాటు పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, ఆరోగ్య భద్రత కోసం హెల్త్‌కార్డు వ్యవస్థను మెరుగుపరచాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా సంయమనంతో చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రయత్నించామని, అయినా పరిష్కారం లభించకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని, అవసరమైతే మరోసారి సమ్మె సైరన్ మోగించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. "ఇక వినతులు చాలు.. చర్చలు కాదు.. సమరమే. ఈసారి డూ ఆర్ డై. పీఆర్సీ అమలు కావాలి.. ఓపీఎస్ పునరుద్ధరణ కావాలి" అని దారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1న ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, భోజన విరామ సమయంలో నిరసనలు చేపట్టి పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సెప్టెంబర్ 8న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ టీఎన్జీవో కమ్యూనిటీ హాల్‌లో ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.



# ఉపాధ్యాయుడు రాజయ్యకు ఘన వీడ్కోలు

వేములవాడ అర్బన్, ఆగస్టు 31 (ఈవార్తలు): వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన శాత్రజ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా సేవలందించిన మారంపల్లి రాజయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని తోటి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ శాసనసభ్యుడు ఆరెపల్లి మోహన్ ముఖ్య అతిథిగా హాజరై రాజయ్యకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ మారుమూల గ్రామమైన రుద్రంగిలో జన్మించిన రాజయ్య ఎన్నో కష్టాలను అధిగమించి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారని తెలిపారు. విద్యార్థుల పట్ల ఆప్యాయతతో మెలుగుతూ వారి విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని, ఆయన సేవలు, క్రమశిక్షణ, అంకితభావం, సహృదయత తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మారంపల్లి రాజయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులు సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటాల ఫలితంగానే తనలాంటి ఎంతోమంది విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోగలిగారని పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, చైతన్యం, ఆత్మగౌరవం పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి, సమాజానికి తమ వంతు సేవ చేయాలని ఆకాంక్షించారు. తన ఉద్యోగ జీవితంలో సహకరించిన అధికారులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులకు రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మారంపల్లి రాజయ్యను తోటి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక కౌన్సిలర్లు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల సాగుపై శిక్షణ



సిరిసిల్ల, ఆగస్టు 31 (ఈవార్తలు): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బిజెఆర్ వ్యవసాయ కళాశాలలో పుట్టగొడుగుల సాగుపై 'ఆరోగ్య పుట్టగొడుగులు' పేరిట శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజియా సుల్తానా, డాక్టర్ లావణ్య మాట్లాడుతూ పుట్టగొడుగుల సాగుతో రైతులు, మహిళా రైతులు, యువత తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి, చిన్నతరహా పరిశ్రమల అవకాశాలను పెంచేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. డాక్టర్ ఎం. రాజేంద్రప్రసాద్ పుట్టగొడుగుల పెంపకం విధానం, సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, పుట్టగొడుగుల పెంపకానికి ఉపయోగించే పదార్థాల తయారీ, నింపే విధానం, విత్తన తయారీ-వినియోగం, వివిధ రకాల పుట్టగొడుగులు, సంరక్షణ, విక్రయ విధానాలు, సాగు ద్వారా ఆదాయం పొందే అవకాశాలపై ప్రాయోగిక అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మహిళా రైతులు, రైతులు, బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులు శివకృష్ణ, ఆస్నా, సౌమ్య, హంపి, మానస, కార్తీక్, కావేరి, శిరీష, లావణ్యతో పాటు యువ పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి కోరుకునేవారు, పుట్టగొడుగుల సాగుపై ఆసక్తి ఉన్నవారు పాల్గొన్నారు.



# 3 దశాబ్దాల సేవకు వీడ్కోలు

**ప్రజారోగ్య చైతన్యానికి అశోక్‌రెడ్డి కృషి**

హనుమకొండ, ఆగస్టు 31 (ఈవార్తలు): వైద్యారోగ్య శాఖలో దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సేవలందించిన వేముల అశోక్‌రెడ్డి ఆగస్టు నెలతో పదవీ విరమణ చేశారు. ఆరోగ్య సహాయకుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన ఆయన జిల్లా మాస్ మీడియా అధికారి స్థాయికి ఎదిగి, ప్రజారోగ్య సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేశారు. 1985లో వైద్యారోగ్య శాఖలో చేరిన అశోక్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య విద్యావేత్తగా, ఉప జిల్లా మాస్ మీడియా అధికారిగా, ఆరోగ్య విద్యా విస్తరణ అధికారిగా, అనంతరం జిల్లా మాస్ మీడియా అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, వ్యాధుల నియంత్రణ చర్యలు, ప్రజారోగ్య కార్యక్రమాల సమాచారాన్ని సామాన్యులకు అర్థమయ్యే భాషలో వివరించేందుకు కృషి చేశారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, మీడియా, ప్రజల మధ్య వారధిగా వ్యవహరించారు. విధి నిర్వహణతోపాటు సామాజిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ, ముంబైలో పీజీడీహెచ్‌ఈ కోర్సును పూర్తి చేశారు. ప్రజారోగ్య కార్యక్రమాల అమలు, ప్రచారం, సమన్వయంలో చూపిన చొరవకు ఆయన ఆరు పర్యాయాలు ఉత్తమ జిల్లా అధికారిగా పురస్కారాలు అందుకున్నారు. క్రమశిక్షణ, సమయపాలనతో పాటు సహచరులు, యువ ఉద్యోగులకు తన అనుభవాలను పంచుకోవడం ఆయన ప్రత్యేకతగా సహచరులు గుర్తుచేసుకున్నారు. వేముల ప్రతాపరెడ్డి-సూర్యమ్మ దంపతుల కుమారుడైన అశోక్‌రెడ్డి, కళావతిని వివాహం చేసుకున్నారు. తేజస్వి, పూజిత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పదవీ విరమణ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు ఆయన సేవలను కొనియాడారు. తెలంగాణ వైద్య ఆరోగ్య గెజిటెడ్ అధికారుల సంఘం తరఫున శుభాకాంక్షలు తెలిపింది. ప్రజారోగ్య రంగంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని పేర్కొంది.

# భీమేశ్వర సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ అర్బన్, ఆగస్టు 31 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధంగా ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం మూడో సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం డిప్యూటీ కార్యనిర్వహణాధికారి నవీన్‌కుమార్, కార్యనిర్వహణ ఇంజినీర్ రాజేష్ ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. సాధారణ దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం క్యూలైన్లలో తోపులాటలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ప్రక్రియ సజావుగా సాగేలా సిబ్బందికి సూచనలు చేశారు. భీమేశ్వర ఆలయంలోని కోడె మొక్కుల ప్రాంగణం, అద్దె కోడెల విభాగం, నిత్యాభిషేక మండపాలను పరిశీలించి భక్తులకు సేవలు త్వరగా అందేలా చర్యలు చేపట్టారు. టికెట్ జారీ కేంద్రాలు, తనిఖీ కేంద్రాల వద్ద రద్దీ పెరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులతో అధికారులు నేరుగా మాట్లాడి దర్శనం, సేవల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీ నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులకు సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన రక్షణ కల్పించాలని ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, శివసాయి, సీనియర్ సహాయకుడు వంశీమోహన్ శర్మ, ఎస్పీఎఫ్ సిబ్బంది, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మాంసం దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

మల్యాల, ఆగస్టు 31 (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మాంసం దుకాణాలపై చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతూ గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మాంసం దుకాణాలను రోడ్ల పక్కన, మురుగు కాలువల సమీపంలో నిర్వహిస్తున్నారని, దుమ్ము, ధూళి, అపరిశుభ్రత, ఈగలు, దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో మాంసం విక్రయించడం వల్ల ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా మాంసం విక్రయిస్తున్న దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని, మేకలు, గొర్రెలను వధించే ముందు పశువైద్య అధికారుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పశువైద్య అధికారులు పరీక్షించి నాణ్యత నిర్ధారించిన మాంసాన్నే విక్రయించేలా నిబంధనలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మాంసం విక్రయానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరిశుభ్రమైన దుకాణాల్లోనే విక్రయాలు జరిగేలా చూడాలని, రోడ్ల వెంట, మురుగు కాలువల పక్కన మాంసం విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## శాంతి కోసం సాయం చేయరూ..!

**భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు**

తాష్కెంట్: అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్న ఇరాన్-అమెరికా వివాదం పరిష్కారానికి భారత్ చొరవ చూపాలని ఇరాన్ నాయకత్వం అభ్యర్థించింది. కిర్గిజ్‌స్థాన్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ ఃసదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తనకున్న దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించాలని ఆయన మోదీని కోరారు. ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్నందుకు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా దౌత్య మార్గాన్ని విడనాడి యుద్ధ మార్గాన్ని ఎంచుకుందని, ఆ దేశంలోని కొన్ని శక్తులు ఈ వివాదం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చర్చలు, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఆయన, ఇతర దేశాలు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధానమంత్రి మోదీ స్పందిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో భారత్ తన దృఢమైన సంబంధాలను కొనసాగించిందని గుర్తుచేశారు. పెజెష్కియాన్‌ను శాంతికాముకుడిగా అభివర్ణించిన మోదీ, శాంతి స్థాపనలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు యుద్ధం ద్వారా లబ్ధి పొందాలని చూస్తారన్న విషయాన్ని అంగీకరిస్తూనే, శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తుదకు శాంతే విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## పోర్న్ యాప్స్ పేరుతో ఆర్థిక మోసాలు

**ఫేస్‌బుక్, ఇన్‌స్టా యూజర్లకు కేంద్రం హెచ్చరిక**

న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో కనిపించే అశ్లీల ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రజలను హెచ్చరించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లపై పోర్నోగ్రఫీ యాప్స్ పేరుతో హానికరమైన ఆండ్రాయిడ్ అప్లికేషన్లను ప్రచారం చేస్తూ సైబర్ నేరగాళ్లు భారీ ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని వెల్లడించింది. కేంద్ర హోం శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో పనిచేసే నేషనల్ సైబర్ క్రైమ్ థ్రెట్ అనలిటిక్స్ యూనిట్ ఈ మేరకు కీలక సూచనలతో కూడిన ఒక సలహా పత్రాన్ని జారీ చేసింది. సైబర్ నేరగాళ్లు ప్రధానంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోర్నోగ్రఫీకి సంబంధించిన ఆకర్షణీయమైన ప్రకటనలను ఇస్తున్నారు. యూజర్లు ఈ ప్రకటనలపై క్లిక్ చేయగానే, వారిని అశ్లీల కంటెంట్ ఉన్న వెబ్‌సైట్‌లకు మళ్లిస్తున్నారు.

## ఇంటర్నెట్ లేకున్నా యూపీఐ చెల్లింపులు!

**యూపీఐ 123 పే.. ఫోన్‌పే కొత్త ఫీచర్**

న్యూఢిల్లీ: ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే ఒక కీలకమైన ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇంటర్నెట్ కనెక్షన్ లేకపోయినా యూపీఐ చెల్లింపులు జరిపేందుకు వీలు కల్పించే 'యూపీఐ 123పే' సేవలను ప్రారంభించింది. ముఖ్యంగా ఇంటర్నెట్ సదుపాయం లేని ఫీచర్ ఫోన్ (బేసిక్ ఫోన్) వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ సేవలను ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నోకియా, హెచ్‌ఎండీ, లావా, ఐటెల్ వంటి ప్రముఖ మొబైల్ తయారీ సంస్థలతో ఫోన్‌పే భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, ఇకపై మార్కెట్లోకి వచ్చే ఆయా కంపెనీల కొత్త ఫీచర్ ఫోన్లలో అప్లికేషన్ ముందే ఇన్‌స్టాల్ అయి ఉంటుంది. ఈ సేవలను వినియోగించుకోవడానికి, వినియోగదారులు తమ ఫోన్‌లోని యాప్‌ను ఓపెన్ చేసి, సంబంధిత బ్యాంకును ఎంచుకోవాలి. అనంతరం తమ డెబిట్ కార్డులోని చివరి ఆరు అంకెలను నమోదు చేసి, యూపీఐ పిన్‌ను సెట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఫీచర్ ద్వారా కేవలం చెల్లింపులే కాకుండా, బ్యాంకు బ్యాలెన్స్ తనిఖీ చేయడం, గత లావాదేవీల వివరాలను చూసుకోవడం వంటి సేవలను కూడా పొందవచ్చు.దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరించడమే లక్ష్యంగా ఈ ఫీచర్‌ను ప్రవేశపెట్టినట్లు ఫోన్‌పే తెలిపింది. ఆంగ్లంతో పాటు 12 భారతీయ భాషలలో ఈ సేవలు అందుబాటులో ఉండటం వల్ల మరింత ఎక్కువ మందికి డిజిటల్ లావాదేవీలు చేరువ కానున్నాయి.

## సింధూ జలాలు..
## హేగ్ తీర్పుపై భారత్ ఫైర్

ఆ కోర్టుకు తమపై ఎలాంటి అధికారం లేదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: సింధు నదీ జలాల ఒప్పందంపై హేగ్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు వెలువరించిన తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అధికారం ఆ కోర్టుకు లేదని సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ఘాటైన ప్రకటన విడుదల చేసింది. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రపంచ బ్యాంకు ఈ మధ్యవర్తిత్వ కోర్టును చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిందని భారత్ ఆరోపించింది. ఈ కోర్టును తాము ఎన్నడూ గుర్తించలేదని, దాని విచారణకు కూడా హాజరు కాలేదని తేల్చి చెప్పింది. "ఈ మధ్యవర్తిత్వ కోర్టుకు మా సార్వభౌమ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం ఏమాత్రం లేదు. ఇప్పుడు గానీ, భవిష్యత్తులో గానీ ఆ కోర్టు తీర్పులు మా చర్యలపై ఎలాంటి ప్రభావం చూపవు" అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి పాకిస్థాన్ కారణమని ఆరోపిస్తూ, ఆ దేశంపై తీసుకున్న కఠిన చర్యల్లో భాగంగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు కొనసాగినంత కాలం ఈ ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ స్పష్టం చేసింది. తాజా తీర్పుతో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని, దేశీయంగా చేపడుతున్న జల ప్రాజెక్టులపై దీని ప్రభావం ఏమాత్రం ఉండదని పునరుద్ఘాటించింది.

## నేపాల్‌కు కే-పాప్ స్టార్ లీ నో భారీ విరాళం



ఖట్మండు: నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న వరద బాధితులను ఆదుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ప్రముఖ దక్షిణ కొరియా పాప్ (కే-పాప్) బ్యాండ్ 'స్ట్రే కిడ్స్' సభ్యుడు లీ నో తన ఉదారతను చాటుకున్నారు. వరద సహాయక చర్యల నిమిత్తం 100 మిలియన్ల కొరియన్ వన్‌లు (భారత కరెన్సీలో సుమారు రూ. 69 లక్షలు) విరాళంగా ప్రకటించారు. 'వరల్డ్ విజన్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా లీ నో మాట్లాడుతూ, "ఈ కష్టకాలంలో నేపాల్‌కు నా వంతు సహాయం అందించాలని నిర్ణయించుకున్నాను. ఆ దేశ ప్రజలు ఈ విపత్తు నుంచి వీలైనంత త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లీ నో 2014 నుంచి వరల్డ్ విజన్‌తో కలిసి పనిచేస్తూ ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గతంలో ఆహార సంక్షోభం, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి కోసం కూడా లీ నో భారీగా విరాళాలు అందజేశారు. మరోవైపు, భారతీయ ఆధ్యాత్మిక గురువు, ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్ సైతం నేపాల్‌కు తనవంతు సాయాన్ని ప్రకటించారు. నేపాల్ ప్రధానమంత్రి సహాయ నిధికి ఆయన రూ. 1 కోటి విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. కాగా, నేపాల్ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన 77 మంది యాత్రికులు గల్లంతవడం తెలిసిందే.

# ఢిల్లీలో మరో నిర్భయ



**కదిలే బస్సులో యువతిపై అత్యాచారం.. మరో ఘటనలో మూడేళ్ల చిన్నారిపై లైంగికదాడి**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటనలు జరిగాయి. కదిలే బస్సులో యువతిపై నిర్భయ తరహా అత్యాచార ఘటన జరిగింది. మరో ఘటనలో ఒక స్కూల్‌లో మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. వివరాల్లోకెళితే.. ఢిల్లీలోని బవానా ప్రాంతంలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో నర్సరీ చదువుతున్న చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ దారుణానికి పాల్పడింది బస్సు స్కూల్ డ్రైవర్. మూడేళ్ల నర్సరీ విద్యార్థిని మర్మావయవాలపై గాయాలుండటాన్ని ఆగష్టు 19న చిన్నారి తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో ఆ గాయాలు ఎలా అయ్యాయని చిన్నారిని తల్లిదండ్రులు అడిగారు. స్కూల్‌లో ఒక బ్యాడ్ అంకుల్ తనకు రోజూ చాక్లెట్లు ఇచ్చి, ఇబ్బంది పెడుతున్నాడని చెప్పింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులకు జరిగిన విషయం అర్థమైంది. వెంటనే వారు పోలీసులకు, స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆ పాపకు ఇంకా మాటలు కూడా సరిగ్గా రావు. ఆ చాక్లెట్లు ఇచ్చిన అంకుల్ ఎవరో చిన్నారి గుర్తించలేదు. అతడి గురించి స్పష్టమైన వివరాలు చెప్పలేకపోయింది. అయితే, స్కూల్‌లో పని చేసే సిబ్బందికి సంబంధించి సీసీటీవీ వీడియో దృశ్యాలు, ఫొటోగ్రాఫ్‌లు చూపించారు. వాటిలో నిందితుడిని ఆ చిన్నారి గుర్తించింది. నిందితుడిని బస్సు డ్రైవర్ వికాస్‌గా గుర్తించారు. చిన్నారి వాష్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో పాప వెంటే వెళ్లేవాడు. చాక్లెట్ల ఆశచూపి, అక్కడి మెట్లకిందికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. గతంలో నాలుగుసార్లు అలా చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డట్లు తేలింది. గతంలో కూడా పలువురు చిన్నారులకు నిందితుడు చాక్లెట్లు ఇవ్వడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డైంది. దీంతో ఆ ఘటనలపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. పాప ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. స్కూల్ ఆవరణలోనే వికాస్‌ను అరెస్టు చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో.. కదిలే బస్సులో 16 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఢిల్లీలోని కాశ్మీరే గేట్ ఏరియాలోని ఖాళీగా ఉన్న ఒక స్లీపర్ బస్సులో ఈ ఘటన ఆగష్టు 4న జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లోని మణిపురి జిల్లాకు చెందిన 16 ఏళ్ల యువతి ఇంటి నుంచి చెప్పకుండా బయటకు వచ్చేసింది. తన ఊరు నుంచి నోయిడాలోని తన బంధువు దగ్గరికి వెళ్లాలనుకుంది. ఈ క్రమంలో ఒక బస్సు ఎక్కింది. అయితే, వర్షం, చీకటి కారణంగా మధ్యలోనే పారి చౌక్ ప్రాంతంలో పొరపాటున దిగేసింది. ఇదే సమయంలో అటు నుంచి ఒక స్లీపర్ బస్సు వెళ్తూ కనిపించింది. దీంతో ఆ బస్సును ఆపాల్సిందిగా యువతి సిగ్నల్ ఇచ్చింది. యువతి ఒంటరిగా ఉండటాన్ని ఆసరాగా చేసుకున్న బస్సు, డ్రైవర్.. తాము కూడా నోయిడాలోని సెక్టార్ 63కే వెళ్తున్నామని చెప్పారు. ఆమెను కావాల్సిన చోట దింపుతామని చెప్పి బస్సులో ఎక్కించుకున్నారు. యువతి బస్సు ఎక్కిన తర్వాత ఆమెపై బస్సు కండక్టర్, తర్వాత డ్రైవర్.. ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. అత్యాచారం అనంతరం యువతిని కాశ్మీర్ గేట్ సమీపంలో దింపేసి వెళ్లిపోయారు. అనంతరం బాధిత యువతి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బస్సు డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌ను అరెస్టు చేశారు. బస్సును సీజ్ చేశారు.

# దేశమంతా ఒకే టైం




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సమయ వినియోగంలో కీలక మార్పు రాబోతుంది. ఇకపై దేశంలోని అధికారిక, పరిపాలనా, వాణిజ్య, న్యాయ, డిజిటల్ కార్యకలాపాల్లో భారత ప్రామాణిక సమయాన్నే తప్పనిసరిగా ఉపయోగించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ 2026 భారత ప్రామాణిక సమయ నిబంధనలను ప్రకటించింది. ఈ నిబంధనలు గెజిట్‌లో ప్రచురితమైన తేదీ నుంచి 180 రోజుల తర్వాత అమల్లోకి రానున్నాయి. అంటే సుమారుగా 2027 మార్చి నుంచి దేశవ్యాప్తంగా ఈ కొత్త విధానం అమల్లోకి రానుంది. రతదేశంలో ప్రస్తుతం అధికారిక సమయంగా భారత ప్రామాణిక సమయాన్నే ఉపయోగిస్తున్నారు. అయితే కొత్త నిబంధనల ద్వారా సమయ వినియోగానికి మరింత స్పష్టమైన చట్టపరమైన ప్రమాణాన్ని తీసుకురానున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయపరమైన వ్యవహారాలు, వాణిజ్య లావాదేవీలు, ఆర్థిక సంస్థలు, డిజిటల్ సేవలు, సమయ ఆధారిత సాంకేతిక వ్యవస్థలు తదితర రంగాల్లో భారత ప్రామాణిక సమయాన్నే ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం వల్ల ప్రజలు తమ గడియారాలు, మొబైల్ ఫోన్లలో సమయాన్ని ప్రత్యేకంగా మార్చాల్సిన అవసరం ఉండదు. దేశంలో ఇప్పటికే భారత ప్రామాణిక సమయమే అధికారిక సమయం. కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశం అధికారిక, వాణిజ్య, సాంకేతిక వ్యవస్థల్లో సమయానికి సంబంధించిన గందరగోళాన్ని తగ్గించడం. ముఖ్యంగా ఒకే సమయంలో కోట్లాది లావాదేవీలు జరిగే డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో సమయానికి అత్యంత ప్రాధాన్యత ఉంది.

## ఉత్తరాఖండ్‌లో 219 'వేలాడే' హిమానీనదాలు

**వీటిలో మూడో వంతు మంచు అస్థిరం**

**గ్లేసియర్లు కూలితే భారీ వరదలు**

**వాతావరణ మార్పుల వల్లే ముప్పు**



న్యూఢిల్లీ: హిమాలయ రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ప్రకృతి విపత్తులకు దారితీసే మరో పెనుముప్పు పొంచి ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. రాష్ట్రంలోని గర్వాల్ హిమాలయాల్లో ఏకంగా 219 'వేలాడే హిమానీనదాలు' (హ్యాంగింగ్ గ్లేసియర్స్) ఉన్నాయని, వాటిలో మూడో వంతు మంచు నిల్వలు అత్యంత అస్థిరంగా ఉన్నాయని ఈ పరిశోధన తేల్చింది. ఈ వివరాలు అంతర్జాతీయ సైన్స్ జర్నల్ 'నేచురల్ హజార్డ్స్'లో ప్రచురితమయ్యాయి. సాధారణంగా లోయల్లో ఉండే హిమానీనదాలతో పోలిస్తే, నిటారుగా ఉండే కొండ వాలులపై ఉండే ఈ 'వేలాడే హిమానీనదాలు' చాలా బలహీనంగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో హిమాలయ ప్రాంతం వేగంగా వేడెక్కుతుండటంతో, ఇవి ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ అధ్యయనం ప్రకారం, ఉత్తరాఖండ్‌లో గుర్తించిన 219 హిమానీనదాల మొత్తం 2.39 క్యూబిక్ కిలోమీటర్లు మంచు ఉండగా, అందులో 0.74 క్యూబిక్ కిలోమీటర్ల మేర మంచు అస్థిరంగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో 2013లో కేదార్‌నాథ్, 2021లో చమోలీ, 2023లో సిక్కింలో సంభవించిన పెను విపత్తులకు ఇలాంటి హిమానీనదాల విస్ఫోటనాలే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం ఫలితాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ సహకారంతో అత్యంత ప్రమాదకరమైన 13 హిమనద సరస్సులపై నిరంతర నిఘా ఉంచింది.

## ఐఎంఈఐ నంబర్ ట్యాంపరింగ్ చేస్తే మూడేళ్ల జైలు, 50 లక్షల ఫైన్

**ఇది కాగ్నిజబుల్, నాన్-బెయిలబుల్ నేరమని స్పష్టం చేసిన టెలికాం శాఖ**

న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ల ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ నంబర్‌ను ట్యాంపర్ చేయడం లేదా ఆ నంబర్ మార్పులు చేసిన ఫోన్లను వాడటంపై కేంద్ర టెలికమ్యూనికేషన్ల విభాగం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చని సోమవారం స్పష్టం చేసింది. దేశంలో మొబైల్, డిజిటల్ సేవలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో టెలికాం ఐడెంటిఫైయర్ల దుర్వినియోగం పౌరుల భద్రతకు, నెట్‌వర్క్‌ల సమగ్రతకు పెను సవాలుగా మారిందని టెలికాం శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే టెలికమ్యూనికేషన్స్ చట్టం, 2023 ప్రకారం కఠిన నిబంధనలను అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ చట్టంలోని సెక్షన్ 42(3)(సీ) ప్రకారం ఐఎంఈఐ నంబర్లతో సహా ఎలాంటి టెలికమ్యూనికేషన్ ఐడెంటిఫైయర్లను ట్యాంపర్ చేయడం నిషేధం. ఈ నిబంధనలను ఉల్లంఘించడం కాగ్నిజబుల్ (వారెంట్ లేకుండానే అరెస్ట్ చేయదగిన), నాన్-బెయిలబుల్ నేరంగా పరిగణిస్తామని టెలికాం శాఖ స్పష్టం చేసింది. ఈ నేరానికి పాల్పడిన వారికే కాకుండా, దానికి సహకరించిన లేదా ప్రోత్సహించిన వారికి కూడా ఇదే శిక్ష వర్తిస్తుందని సెక్షన్ 42(6) చెబుతోందని వివరించింది. మోసపూరిత మార్గాల్లో, ఫేక్ డాక్యుమెంట్లు సమర్పించి సిమ్ కార్డులు పొందడం కూడా నేరమేనని పేర్కొంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడంతో పాటు ఐటీ, మెటల్, రియల్టీ, మీడియా షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. దీంతో కీలక సూచీలు దిగువకు జారాయి. సెన్సెక్స్ 307.24 పాయింట్లు నష్టపోయి 76,957.27 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 95.25 పాయింట్లు క్షీణించి 24,080.40 వద్ద ముగిసింది. నిఫ్టీలో ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, ఎటర్నల్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. ఐటీ, మెటల్, రియల్టీ, మీడియా రంగాల సూచీలు మార్కెట్‌పై ఒత్తిడి పెంచాయి. మరోవైపు ఆటో, ప్రైవేట్ బ్యాంక్ రంగాలు కొంత మద్దతు అందించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.24 శాతం లాభపడగా..



ఈవార్తలు
# వినోదవాణి CINEMA
మంగళవారం 1-9-2026, జగిత్యాల | www.evarthalu.com


## వయ్యారి చిత్రం



## ఒక్కటి కాబోతున్న కాలభైరవ, కావ్య





సినీ, సంగీత వర్గాల్లో కొంతకాలంగా వినిపిస్తున్న ఓ వార్తకు ఇప్పుడు అధికారిక ముద్ర పడింది. గాయకుడు కాలభైరవ, నటి కావ్య కల్యాణ్‌రామ్ తమ ప్రేమ బంధాన్ని బహిరంగంగా ప్రకటించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఇద్దరూ తమ రిలేషన్‌షిప్‌ను వెల్లడించారు. దీంతో వీరిద్దరి మధ్య ఉన్న బంధంపై ఇన్నాళ్లుగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. కాలభైరవ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో కావ్యపై తనకున్న భావాలను ఎంతో అందంగా పంచుకున్నాడు. ఆమెతో సమయం గడపడం కొండల మధ్య కూర్చొని సెలయేటి ప్రవాహాన్ని చూస్తున్నంత ప్రశాంతంగా ఉంటుందని చెప్పాడు. ఆమెతో కలిసి చేసే ప్రతి పని ముగియకూడదనిపించే విహారయాత్రలా ఉంటుందని పేర్కొన్నాడు. చలికాలపు ఉదయం తనకు ఇష్టమైన కాఫీ తాగుతున్నంత హాయిగా ఆమెతో మాట్లాడటం అనిపిస్తుందని తెలిపాడు. ఇన్నాళ్లూ తనలో కలిగిన ఆ అనుభూతికి పేరు పెట్టలేకపోయానని కాలభైరవ చెప్పాడు. కానీ తమ ప్రయాణంలో ఓ దశలో ఆ భావన ఏంటో అర్థమైందని తెలిపాడు. అది 'హోమ్' అనే భావన అని వెల్లడించాడు. "నిన్ను తొలిసారి కలిసినప్పుడు కొత్త వ్యక్తిని కలిసినట్లు అనిపించలేదు. ఇంటికి వచ్చినట్లు అనిపించింది. అటుపై అక్కడి నుంచి వెళ్లలేదు" అంటూ కావ్యపై తన ప్రేమను వ్యక్తం చేశాడు.

## ఎమోషనల్ కథతో శ్రీవిష్ణు

వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యంగ్ హీరో శ్రీవిష్ణు మరో కొత్త సినిమాను ప్రకటించారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీవిష్ణు.. ఈసారి మాత్రం సరికొత్త ఎమోషనల్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది.



తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కొత్త దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హారికా హాసిని ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత చినబాబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ గ్లింప్స్ విడుదల చేశారు. తాజాగా విడుదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. చిన్నప్పటి నుంచి ఎన్నో కలలు కనే ఓ సాధారణ మధ్యతరగతి అబ్బాయి.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, బాధ్యతల కారణంగా తన ఆశలను పక్కన పెట్టి సాధారణ జీవితాన్ని కొనసాగించే పరిస్థితిని ఇందులో చూపించినట్లు తెలుస్తోంది. మంచి కాలేజీలో చదవాలనే కోరిక ఉన్నా కుటుంబ పరిస్థితుల కారణంగా సాధారణ కాలేజీలో చదవడం.. జీవితంలో ఎన్నో సాధించాలని ఆశించినా కుటుంబ బాధ్యతల కోసం ఉద్యోగం చేయడం.. ఇలా ఎంతోమంది మిడిల్ క్లాస్ యువకుల జీవితాల్లో ఎదురయ్యే పరిస్థితులను ఈ సినిమాలో చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది.

## సందీప్ సరోజ్ 'వేట'

'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యువ నటుడు సందీప్ సరోజ్, సాత్విక జంటగా 'వేట' అనే కొత్త చిత్రం సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. అశోక్ కోటిపల్లి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ఆర్‌డి ప్రొడక్షన్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవానికి మెగా బ్రదర్ కొణిదెల నాగబాబు, ప్రముఖ దర్శకులు కేఎస్ రవికుమార్, మెహర్ రమేష్, వీఎన్ ఆదిత్య, 'బేబీ' చిత్ర దర్శకుడు సాయి రాజేష్, నిర్మాత ఎస్‌కేఎన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు సన్నివేశానికి నాగబాబు స్క్రిప్ట్ అందించగా, కేఎస్ రవికుమార్ క్లాప్ కొట్టారు. సాయి రాజేశ్, ఎస్‌కేఎన్, వీఎన్ ఆదిత్య, నిర్మాత ఫణి అడపాక కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రముఖ దర్శకుడు కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ.. ఈ చిత్రంలో తాను ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. "దర్శకుడు అశోక్ కథ చెప్పినప్పుడు చాలా అద్భుతంగా అనిపించింది. ఇందులో నాది ఊర్లో పెదరాయుడు తరహా పాత్ర. కొత్త వాళ్లతో తెరకెక్కుతున్న ఈ సినిమా నేటితరం ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటుంది" అని ఆయన పేర్కొన్నారు.





## 'రోమాంచకం'లో బబ్లీ గర్ల్‌గా కనిపిస్తా: అనంతిక

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, భద్రకాళి పిక్చర్స్ పతాకంపై సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'రోమాంచకం'. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ చిత్రంతో వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం చిత్ర హీరోయిన్ అనంతిక మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా అనంతిక మాట్లాడుతూ, "'8 వసంతాలు' తర్వాత చాలా కథలు విన్నాను. కానీ ఏదీ నన్ను అంతగా ఆకట్టుకోలేదు. ఆ సమయంలో 'రోమాంచకం' కథ వినగానే చాలా సంతోషం వేసింది. నేను చేయాలనుకున్న సినిమా ఇదే అనిపించింది. ఈ సినిమాలో బబ్లీగా, సరదాగా ఉండే అమ్మాయి పాత్ర నాది. ఇలాంటి పాత్ర చేయాలని ఎప్పటినుంచో కలలు కన్నాను" అని తెలిపారు. "ఈ చిత్రం యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాదు, ఇందులో హాస్యంతో పాటు ఉత్కంఠ కూడా ఉంటుంది. యూత్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేయవచ్చు. ఇందులో నేను తమిళ అమ్మాయిగా కనిపిస్తాను. హీరో సుమంత్ ప్రభాస్ పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. దానికి తగ్గట్టుగానే నా పాత్రను కూడా డిజైన్ చేశారు. మా ఇద్దరి మధ్య సంభాషణలు చాలా సహజంగా, వేగంగా సాగుతాయి" అని ఆమె వివరించారు.

## డీప్ ఫేక్ నగ్న వీడియోలు అవి

'అర్జున్ రెడ్డి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి షాలినీ పాండే, తనపై ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్న డీప్‌ఫేక్ వీడియోపై తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిగా కల్పితమని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన నకిలీ వీడియో అని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. ఆన్‌లైన్‌లో ప్రచారమవుతున్న ఆ వీడియో పూర్తిగా అవాస్తవం. అందులో ఉన్నది నేను కాదు" అని షాలినీ స్పష్టం చేశారు. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ వ్యక్తులను, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించకూడదని, ఇది ఒక రకమైన వేధింపేనని ఆమె పేర్కొన్నరు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. ఆ నకిలీ వీడియోను ఎవరూ షేర్ చేయవద్దని, ఇతరులకు పంపవద్దని, అలాగే డౌన్‌లోడ్ చేయవద్దని కోరారు. దానికి బదులుగా, ఆ వీడియోను వెంటనే రిపోర్ట్ చేయాలని సూచించారు.



## దవాఖానే నాకు బోధి వృక్షం



టాలీవుడ్‌లో వరుస సినిమాలతో అగ్ర కథానాయికగా దూసుకెళుతున్న శ్రీలీల, తన నటన వెనుక ఉన్న ఒక ఆసక్తికరమైన రహస్యాన్ని పంచుకున్నారు. తాను చదివిన వైద్య విద్య, ఆ సమయంలో ఎదురైన అనుభవాలు ఒక నటిగా తనను ఎంతగానో ప్రభావితం చేశాయని ఆమె తెలిపారు. కార్తీక్ ఆర్యన్‌తో కలిసి తన తొలి బాలీవుడ్ చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, శ్రీలీల ఈ విషయాలను వెల్లడించారు. "వైద్య విద్య నా నటనకు కచ్చితంగా 100 శాతం ఉపయోగపడింది. ఒక నటికి/నటుడికి లోకజ్ఞానం, సాధారణ పరిజ్ఞానం చాలా అవసరం. ముఖ్యంగా అనుభవాలు, ఇతరుల పట్ల సున్నితంగా స్పందించే గుణం ఎక్కువగా ఉండాలి" అని శ్రీలీల అన్నారు. తన ఎంబీబీఎస్ మెడికల్ కోర్సులో భాగంగా హాస్పిటల్ పోస్టింగ్‌లకు వెళ్లినప్పుడు ఎన్నో నిజ జీవిత కథలను దగ్గరగా చూశానని ఆమె వివరించారు. "హాస్పిటల్‌లో ప్రజల భావోద్వేగ ప్రయాణాలను చాలా సమీపం నుంచి గమనించాను. అక్కడ జీవితం, మరణం రెండూ కనిపిస్తాయి. బిల్లులు కట్టడానికి ఆర్థికంగా ఇబ్బంది పడే వారిని చూశాను. ఇలాంటి ఎన్నో కథలు ఉంటాయి. అసలు సినిమా అంటేనే కథ కదా! రోజూ ఇలాంటి మూడు, నాలుగు కథలను చూడటం వల్ల ప్రపంచంపై నా దృక్పథం పూర్తిగా మారిపోయింది".




# మెస్సీ టాటా!

జాతీయ జట్టుకు రిటైర్మెంట్

ఫిఫా ఫైనల్ ఓటమి కలచివేసిందని లేఖ.. తండ్రి మరణంతో కుంగిపోయానని వెల్లడి

## భారత్ చేతిలో థాయిలాండ్ చిత్తు

**94 పరుగుల తేడాతో చిత్తు చేసిన టీమిండియా**

**36 బంతుల్లో 64 పరుగులు చేసిన షఫాలీ వర్మ**



మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత జట్టు ఘన విజయం సాధించి టోర్నీని ఘనంగా ప్రారంభించింది. థాయ్‌లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 94 పరుగుల భారీ తేడాతో విజయం నమోదు చేసింది. దుబాయ్‌లో జరిగిన ఈ పోరులో ఓపెనర్ షఫాలీ వర్మ మెరుపు అర్ధశతకంతో సత్తా చాటగా, బౌలర్లు సమష్టిగా రాణించి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ కేవలం 36 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ మ్యాచ్‌తోనే టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ప్రతీక రావల్ 18 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు చేసి రాణించింది. థాయ్‌లాండ్ బౌలర్లలో లావోమి 3 వికెట్లు పడగొట్టగా, సునిద 2 వికెట్లు తీసింది. అనంతరం 160 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్, భారత బౌలర్ల ధాటికి తలవంచింది. ఆ జట్టు 16.1 ఓవర్లలో కేవలం 65 పరుగులకే కుప్పకూలింది. థాయ్‌లాండ్ బ్యాటర్లలో కొంచరోయెంకాయ్ (41) మాత్రమే ఒంటరి పోరాటం చేయగా, మిగతా వారెవరూ కనీస పోరాట పటిమ కనబరచలేకపోయారు. భారత బౌలర్లలో నందని శర్మ, దీప్తి శర్మ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. శ్రీ చరణి రెండు వికెట్లు, క్రాంతి గౌడ్ ఒక వికెట్ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

## ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యాన్ని వదులుకోం: శ్రీలంక

మొట్టమొదటి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ వేదికపై అనిశ్చితి కొనసాగుతుంది. శ్రీలంక నుంచి టోర్నీని తరలించేందుకు ఐసీసీ సిద్ధమైన నేపథ్యంలో మరి ఎక్కడ నిర్వహిస్తారు? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ పరిస్థితుల్లో లంక తాత్కాలిక ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ మాత్రం అరంగేట్రం సీజన్ ఆతిథ్య హక్కులను ఎట్టిపరిస్థితుల్లోనే వదులుకునేందుకు సిద్ధంగా లేమని అంటోంది.. ఎలాగైనా సరే ఈ మెగా ఈవెంట్‌ను తమ దేశంలో జరిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనుంది కమిటీ. శ్రీలంక క్రికెట్‌పై అసంతృప్తితో మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని వేరే దేశంలో నిర్వహించేందుకు ఐసీసీ ఆలోచిస్తోంది. వేదిక తరలింపు అంశం తెరపైకి రావడంతో అప్రమత్తమైంది లంక క్రికెట్. ఇది అరంగేట్రం సీజన్ కావడంతో ఎలాగైనా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాత్కాలిక ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ గట్టిగా ప్రయత్నిస్తోంది. అందుకోసం అత్యవసరంగా సంస్కరణలకు సిద్ధమవుతోంది. తాము ఐసీసీని ఒప్పించి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ అరంభ సీజన్‌ను లంకలోనే జరిగేలా చూస్తామని మధ్యంతర కమిటీ ఛైర్మన్ ఎరాన్ విక్రేమరత్నా తెలిపాడు.

*మెస్సీ కనిపిస్తే అభిమానులకు పూనకాలు..*
*బాల్ తట్టినా, గోల్ కొట్టినా కేరింతలు..*
*అతడి పాదాలకు మైదానమే మంత్రముగ్ధం..*
*అతడి డ్రిబ్లింగ్‌కు ప్రత్యర్థుల గుండెల్లో దడ..*
*ప్రత్యర్థి జట్టుపై దండయాత్రను ఇక చూడలేం..*
*అలాంటి ఉద్వేగాలు, భావోద్వేగాలు స్పృశించలేం..*
*ఫుట్‌బాల్‌ను ఆటగానే కాకుండా ఓ భావోద్వేగంగా మార్చిన మాంత్రికుడు లియోనెల్ మెస్సీ.. తన కెరీర్‌కు వీడ్కోలు పలికాడు.*

**ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరఫున బరిలోకి దిగనని సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు.**

ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.




"ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. "ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను" అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు. తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణాలను మెస్సీ స్పష్టంగా వివరించాడు. జూలైలో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌పై అర్జెంటీనా ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపాడు. ఆ ఓటమి తర్వాత రెండు రోజులకే, అంటే జూలై 21నే తాను ఈ వీడ్కోలు లేఖను రాసుకున్నట్లు వెల్లడించాడు. అయితే, ఇటీవల మా నాన్న మరణం తర్వాత, ఇక కొనసాగలేనన్న నమ్మకం బలపడింది" అని పేర్కొన్నాడు. మెస్సీకి తండ్రి జార్జ్ మెస్సీనే ఏజెంట్‌గా వ్యవహరించారు. సుదీర్ఘ అనారోగ్యంతో ఆగస్టు 8న మరణించిన విషయం తెలిసిందే. కాలం గడిచిపోవడం, కొత్త తరం క్రీడాకారులు జట్టులోకి రావడం కూడా తన నిర్ణయానికి ఒక కారణమని మెస్సీ వివరించాడు. "నాకు మిగిలింది తక్కువ సమయమే. నా జీవితంలో కొన్ని అధ్యాయాలు ముగింపు దశకు వస్తున్నాయి. అందులో ఇది ఒకటి. ఇది నన్ను చాలా బాధిస్తోంది. నేను జాతీయ జట్టులో భాగమవ్వడాన్ని ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశాను. ఇక ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. అంతేకాకుండా, అద్భుతమైన యువ క్రీడాకారులు వస్తున్నారు. వారికి అవకాశం దక్కాలి" అని పేర్కొన్నాడు. రెండు దశాబ్దాల తన అంతర్జాతీయ ప్రయాణంలో తనకు అండగా



నిలిచిన అభిమానులకు మెస్సీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. "గడిచిన 20 ఏళ్లుగా మీరు చూపించిన ప్రేమకు, మద్దతుకు ధన్యవాదాలు. స్టేడియం లోపలి నుంచి మీ కేరింతలను నేను చాలా మిస్ అవుతాను. ఇకపై నేను కూడా మీలో ఒకడిగా, మంచి చెడు సమయాల్లో, ముఖ్యంగా కష్టకాలంలో బయటి నుంచి జట్టుకు మద్దతు ఇస్తాను" అని తెలిపాడు. తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులకు, కోచ్‌లకు, సహచర ఆటగాళ్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపాడు. "ఈ అందమైన, అదే సమయంలో కఠినమైన ప్రయాణంలో నాతో పాటు ఉన్న నా కుటుంబానికి ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి కోచ్, సహచరుడు, అధికారికి నా కృతజ్ఞతలు. ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకాలను, క్షణాలను నాతో పాటు తీసుకువెళుతున్నాను" అని పేర్కొన్నాడు. జట్టు సభ్యులతో కలిసి దేశం కోసం సాధించిన విజయాలపై గర్వంగా, సంతృప్తిగా ఉన్నానని మెస్సీ తెలిపాడు. "నా సహచరులతో కలిసి, మనం కలలు మాత్రమే కనగలిగే క్షణాలను మీకు అందించామన్న గర్వంతో, మనశ్శాంతితో నేను వెళ్ళిపోతున్నాను. మీతో కలిసి ఆ అనుభూతిని పొందడం ఒక అద్భుతం. ఐ లవ్ యూ! నన్ను అర్జెంటీనా వాడిగా పుట్టించినందుకు దేవుడికి ధన్యవాదాలు. లెట్స్ గో, అర్జెంటీనా!" అంటూ తన లేఖను ముగించాడు. 2005లో అర్జెంటీనా సీనియర్ జట్టులోకి అరంగేట్రం చేసిన మెస్సీ, 207 మ్యాచ్‌లతో దేశం తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 125 గోల్స్ సాధించాడు. తన కెరీర్‌లో 2022లో ప్రపంచకప్ విజయం, రెండు కోపా అమెరికా టైటిళ్లు వంటి శిఖరాలను అధిరోహించడంతో పాటు, 2014, 2026 ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఓటముల వంటి బాధాకరమైన క్షణాలను కూడా చవిచూశాడు. అతడి అంతర్జాతీయ కెరీర్ ముగిసినప్పటికీ, క్లబ్ ఫుట్‌బాల్‌లో మాత్రం కొనసాగనున్నారు. 2028 వరకు కాంట్రాక్ట్ ఉన్న ఇంటర్ మయామి జట్టు తరఫున ఆయన ఆడటం కొనసాగిస్తాడు. మెస్సీ వీడ్కోలుతో అర్జెంటీనా ఫుట్‌బాల్‌లో ఒక స్వర్ణయుగం ముగిసినట్లయింది.

## ధోనీకి వాటా వార్తలు వదంతులే: సీఎస్కే సీఈవో

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఫ్రాంచైజీలో ఆ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ వాటా కోరుతున్నట్లు వస్తున్న వార్తలను సీఎస్కే యాజమాన్యం ఖండించింది. ఈ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని, అవన్నీ కేవలం నిరాధారమైన వదంతులని సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. దీంతో గత కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది. ఐపీఎల్ ప్రారంభం నుంచి సీఎస్కేతో ధోనీకి విడదీయరాని అనుబంధం ఉంది. అతడి సారథ్యంలో జట్టు ఏకంగా ఐదుసార్లు ఐపీఎల్ టైటిళ్లను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో, ఫ్రాంచైజీతో తన బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే క్రమంలో ధోనీ సుమారు 20 శాతం వాటాను కొనుగోలు చేయాలని భావిస్తున్నాడని, కానీ సీఎస్కే యాజమాన్యం కేవలం 3 శాతం మాత్రమే ఆఫర్ చేసిందని కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలతో ఇరువర్గాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని కూడా జోరుగా ప్రచారం జరిగింది. ఈ వదంతులపై కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ, "ధోనీ వాటా అడిగాడన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదు. అవన్నీ కేవలం పుకార్లు మాత్రమే" అని కొట్టిపారేశారు.



## జొకోవిచ్.. వెక్కి వెక్కి ఏడ్చి!

టెన్నిస్ లెజెండ్ నోవాక్ జొకోవిచ్ ఏడ్చేశాడు. యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఓడిన అతను.. చివరి సెట్‌లో కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఓడిపోతున్నానన్న భావోద్వేగాన్ని అతను ఆపుకోలేకపోయాడు. సెర్బియా స్టార్ జొకోవిచ్ 7-6 (5), 5-7, 4-6, 6-2, 6-1 స్కోరుతో అర్జెంటీనా ప్లేయర్ మారియానో నవోని చేతిలో ఓటమి పాలయ్యాడు. 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన జొకోవిచ్ 39 ఏళ్ల వయసులో గట్టి పోటీ ఇచ్చాడు. చివర వరకు ఫస్ట్ రౌండ్‌ను గట్టెక్కేందుకు ప్రయత్నించాడు. కానీ అతను ప్రయత్నం సఫలం కాలేదు. ఓ దశలో అతను తన టవల్‌లో కక్కేశాడు. నాలుగవ సీడ్ జొకోవిచ్.. తొలి సారి యూఎస్ ఓపెన్‌లో ఫస్ట్ రౌండ్‌లోనే నిష్క్రమించాడు. 2006 తర్వాత గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో అతను తొలి రౌండ్‌లో ఓడిపోవడం ఇదే మొదటిసారి. మ్యాచ్ ఓడిన తర్వాత మాట్లాడుతూ ఆ ఫీలింగ్‌ను తట్టుకోలేకపోయినట్లు చెప్పాడు.

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# ప్రజాస్వామ్య పోరాటం

నక్సలిజం అంటే ఒకప్పుడు అడవులు గుర్తుకొచ్చేవి. తుపాకులు, మందుపాతరలు, కొండలు, దట్టమైన అడవుల్లో సంచరించే దళాలు గుర్తుకొచ్చేవి. కానీ కాలం మారింది. భద్రతా బలగాల ఒత్తిడి, అభివృద్ధి, రహదారులు, సమాచార వ్యవస్థల విస్తరణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, వరుస లొంగుబాట్లతో సాయుధ మావోయిస్టు ఉద్యమం తన పాత భౌగోళిక పునాదిని కోల్పోయింది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2026 మార్చి 31 నాటికి దేశంలో ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత జిల్లాలు లేవని ప్రభుత్వం ప్రకటించింది; 2024 నుంచి 2026 మార్చి వరకు 3,927 మంది మావోయిస్టు కేడర్లు లొంగిపోయినట్లు తెలిపింది. అయితే ఇక్కడితో కథ ముగిసిందా? అదే అసలు ప్రశ్న. తుపాకీ పట్టిన చేయి ఆయుధాన్ని వదిలేయవచ్చు. అడవిని వదిలి జనజీవన స్రవంతిలోకి రావచ్చు. కానీ ఏళ్ల తరబడి నమ్మిన సిద్ధాంతం, అసంతృప్తి, వ్యవస్థపై వ్యతిరేకత, సామాజిక అన్యాయాలపై ఆగ్రహం.. ఇవన్నీ ఒక్కరోజులో మాయమవుతాయా? అందుకే నేడు నక్సలిజాన్ని కేవలం 'అడవిలో ఉన్న సాయుధ దళం'గా చూడటం సరిపోదు. ఒకవేళ మిగిలిన మావోయిస్టు భావజాలం ప్రజా ఉద్యమాలు, సామాజిక సంస్థలు, విద్యార్థి వర్గాలు, కార్మిక సంఘాలు, ప్రజా సమస్యల చుట్టూ జరిగే ప్రచారాల రూపంలో కొత్త ప్రదేశాలను వెతుక్కుంటే.. అది భద్రతా వ్యవస్థకు మరో కొత్త సవాలు కావచ్చు. ఇటీవల "దిమాగీ నక్సల్" అనే పదం కూడా రాజకీయ చర్చలోకి వచ్చింది. అయితే ఈ పదాన్ని ఎవరిపై పడితే వారిపై ముద్ర వేయడానికి ఉపయోగించడం మరింత ప్రమాదకరం. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి మేధావి నక్సలైట్ కాదు. ప్రభుత్వ విధానాన్ని విమర్శించే ప్రతి సామాజిక కార్యకర్త మావోయిస్టు కాదు. అసమ్మతి ప్రజాస్వామ్యానికి శత్రువు కాదు. ఇదే చోట ప్రజాస్వామ్యం, తీవ్రవాద భావజాలం మధ్య స్పష్టమైన గీత గీయాల్సిన అవసరం ఉంది. మావోయిస్టు సిద్ధాంతం చారిత్రకంగా సాయుధ విప్లవాన్ని సమర్థించింది. హింస ద్వారా రాజకీయ మార్పు సాధించాలనే ఆలోచన భారత రాజ్యాంగ వ్యవస్థకు పూర్తిగా విరుద్ధం. గత దశాబ్దాల్లో జరిగిన హింసలో సామాన్య పౌరులు, భద్రతా సిబ్బంది, ప్రజాప్రతినిధులు ప్రాణాలు కోల్పోయారు. కాబట్టి తుపాకీ రాజకీయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థన ఉండకూడదు. అయితే అదే సమయంలో మరో వాస్తవాన్ని కూడా అంగీకరించాలి. తుపాకీని ఓడించడం కంటే తుపాకీకి అవసరం లేకుండా చేసే సమాజాన్ని నిర్మించడం గొప్ప విజయం. అడవుల్లో మావోయిస్టుల ప్రభావం తగ్గిందంటే అక్కడి ప్రజల సమస్యలు అన్నీ పరిష్కారమయ్యాయని అర్థం కాదు. భూమి, అటవీ హక్కులు, ఉపాధి, విద్య, వైద్యం, గిరిజన హక్కులు, ఖనిజ సంపదపై స్థానికుల హక్కులు, పునరావాసం.. ఇవన్నీ ఇప్పటికీ చర్చించాల్సిన అంశాలే. ప్రభుత్వం కూడా భద్రతతో పాటు అభివృద్ధి, పునరావాసం, పాలనను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని చెబుతోంది. ఎల్‌డబ్ల్యూఈ ప్రాంతాల్లో 2014 నుంచి 12,249 కిలోమీటర్ల రహదారులు నిర్మించినట్లు, వేలాది మొబైల్ టవర్లు ఏర్పాటు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. అయితే అభివృద్ధి అంటే కేవలం రోడ్డు వేయడం కాదు. ప్రజలకు నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించడం కూడా అభివృద్ధే. ఒక గ్రామానికి రోడ్డు వచ్చింది. సెల్‌ఫోన్ వచ్చింది. పాఠశాల వచ్చింది. కానీ ఆ గ్రామస్థుడి మాటకు విలువ లేకపోతే? అతని భూమి సమస్య పరిష్కారం కాకపోతే? అతని పిల్లలకు నాణ్యమైన విద్య అందకపోతే? ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోతే? అప్పుడు అభివృద్ధి గణాంకాలు ప్రజల అసంతృప్తిని పూర్తిగా తొలగించలేవు. ఇదే ఖాళీని ఏదైనా తీవ్రవాద భావజాలం ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. అందుకే మావోయిస్టులను అడవుల్లో మాత్రమే వెతకడం కాకుండా.. ప్రజల్లో అసంతృప్తికి కారణమయ్యే మూలాలను కూడా గుర్తించాలి. అది పోలీసుల పని మాత్రమే కాదు. పాలకుల పని. పరిపాలనా వ్యవస్థ పని. ప్రజాప్రతినిధుల పని. న్యాయవ్యవస్థ పని. సమాజం పని. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను వినడానికి ఎన్నికలు ఉన్నాయి. ఆందోళనలు ఉన్నాయి. పత్రికలు ఉన్నాయి. న్యాయస్థానాలు ఉన్నాయి. సామాజిక సంస్థలు ఉన్నాయి. ప్రజా ప్రతినిధులను ప్రశ్నించే హక్కు ఉంది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉంది. అందువల్ల ప్రజల అసంతృప్తిని నక్సలిజంగా ముద్ర వేయడం ఎంత ప్రమాదకరమో.. నక్సలిజం పేరుతో హింసను సమర్థించడం కూడా అంతే ప్రమాదకరం. అడవిలో నక్సలిజం తగ్గిపోయిందని సంబరపడిపోవద్దు. ప్రజల మనసుల్లో ఏ ఆలోచనలు పుడుతున్నాయో వినాలి. ఎందుకంటే తుపాకీని అదుపు చేయగలిగేది బలం కావచ్చు.. కానీ ప్రజల మనసులను గెలుచుకోగలిగేది న్యాయం, అభివృద్ధి, ప్రజాస్వామ్యం మాత్రమే.

# పచ్చని అడవిలో నెత్తుటి వాన

## పీపుల్స్ వార్ తొలి మందు పాతరకు 37 ఏళ్లు

ప్రకృతి ఎప్పుడూ శాంతికి నిలయం.. ఆ పచ్చని చెట్లు లాలించే తల్లి ఒడికి సంకేతం. కానీ, మానవ మనుగడలోకి ద్వేషం ప్రవేశించినప్పుడు, సిద్ధాంతాల పేరిట ప్రతీకార జ్వాలలు రగిలినప్పుడు ఆ సృష్టి సౌందర్యమంతా ఒక్కసారిగా చిన్నబోతుంది. మనుషులు హృదయాల్లో పెంచుకున్న కసి, రాజకీయ విమర్శలు, అధికారం కోసం సాగించే రక్తపిపాస ముంగిట.. ఆ ప్రశాంత వాతావరణం, పక్షుల కిలకిలరావాలు అన్నీ ఒక్క క్షణంలో మూగబోతాయి. పచ్చని అడవి తల్లి తన బిడ్డల రక్తంతో తడిసిముద్దై, మనుషుల దారుణాలకు దిగ్భ్రాంతి చెంది అశ్రునయనాలతో నిశ్శబ్దంగా విలపించడం తప్ప ఏమీ చేయలేని అచేతన స్థితిలోకి జారిపోతుంది.

1980ల కాలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు, నక్సలైట్ ఉద్యమానికి కేంద్రబిందువుగా ఉండేది. దొరల దౌర్జన్యాలు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పీపుల్స్ వార్ గ్రూప్ చేసిన పోరాటాలకు బీర్పూర్ వంటి గ్రామాల్లో ప్రజల మద్దతు ఉండేది. కానీ, కాలక్రమేణా నాటు తుపాకులు, గొడ్డళ్ల స్థానంలోకి వచ్చిన ప్రతీకార హింస.. అమాయక పౌరుల రక్తాన్ని ఏ విధంగా ఏరులై పారించిందో చెప్పడానికి ఈ ఘోరకలే సజీవ సాక్ష్యం!




**1989 సెప్టెంబర్ 1** శుక్రవారం ఉదయం.. ఆకాశం కంటికి కనిపించని కాటుక మబ్బులను కప్పుకుని మౌనంగా రోదిస్తోంది. రాత్రంతా కురిసిన వర్షానికి భూమి తడిసిముద్దైంది. ఏదో ఘోరకలి జరగబోతోందని కాబోలు.. సారంగాపూర్, బీర్పూర్ మధ్య బట్టపల్లి- పోతారం ఘాట్ రోడ్డులోని ఆ పచ్చని అడవి అంతా ఒక వింతైన, భయానకమైన నిశ్శబ్దంతో అచేతనంగా ఉండిపోయింది. ఈ రక్తాసిక్త చరిత్రకు బీజం కొద్దిరోజుల ముందే పడింది. 1989 ఆగస్టులో సారంగాపూర్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్, ఎంపీడీవో భవనాల శంకుస్థాపన కోసం నాటి హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి, స్థానిక నాయకుడు కోండ్ర మల్లారెడ్డి అభ్యర్థన మేరకు వచ్చారు. ఆ కార్యక్రమంలో జగిత్యాల డీఎస్పీ వేణుగోపాలకృష్ణ, సీఐ నరసింగరావుల నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇంత దూరం వచ్చాం కదా అని హోంమంత్రి మాధవరెడ్డి, పీపుల్స్ వార్ అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు స్వగ్రామమైన బీర్పూర్ గ్రామం చూద్దామని ఆసక్తితో వెళ్లారు. అక్కడ నిర్వహించిన సభకు భయంతో జనం రాలేదు, సర్పంచ్ సైతం వేదిక ఎక్కలేదు. దాంతో కోపోద్రిక్తుడైన హోంమంత్రి.. "పోరాటాల పేరు చెప్పే నక్సల్స్ నాయకుడు గణపతి సొంత ఊరిలోనే కనీసం ఒక పాఠశాల లేదు, పంచాయతీ భవనం లేదు.. వీళ్లా సమాజాన్ని ఉద్ధరించేది?" అంటూ సవాల్ విసిరారు. తమ ఆధిక్య ప్రాంతంలోకి వచ్చి హోంమంత్రి అలా కించపరిచేలా మాట్లాడటాన్ని నక్సలైట్లు భరించలేకపోయారు. ఆ పర్యటనను ఏర్పాటు చేసిన జగిత్యాల డీఎస్పీ వేణుగోపాలకృష్ణ, సీఐ నరసింగరావులను ఎలాగైనా హతమార్చి ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. పోలీసు యంత్రాంగాన్ని దెబ్బతీయడానికి ఆయుధాల వ్యూహాన్ని మారుస్తూ, పీపుల్స్ వార్ చరిత్రలోనే తొలిసారిగా "మందుపాతర (ల్యాండ్‌మైన్) సాంకేతికతను" ప్రయోగించాలనుకున్నారు. ఏకంగా 7 ల్యాండ్‌మైన్లు వంతెన కల్వర్టు కింద పాతిపెట్టారు. ఆ అధికారులను ఎలాగైనా ఘాట్ రోడ్డుకు రప్పించడం కోసం.. పేలుడుకు ఒకరోజు ముందే (ఆగస్టు 31న) గణపతి అన్నకు పిల్లనిచ్చిన మామ, బీర్పూర్ మాజీ పట్వారి వంగపల్లి తిరుపతిరావును నక్సలైట్లు దారుణంగా హత్య చేసి, తలా మొండెం వేరు చేశారు. ఆ హత్య విచారణ పేరుతో పోలీస్ అధికారులు కచ్చితంగా ఘాట్ రోడ్డు మీదుగానే వస్తారని వ్యూహం పన్నారు.

మరుసటి రోజు (సెప్టెంబర్ 1) ఉదయం జగిత్యాల పాత బస్టాండ్ వద్ద ఒక గ్రీన్ కలర్ కిరాయి జీపు నిలిచి ఉంది. నాటి రోజుల్లో పోలీస్ వాహనాలు కూడా గ్రీన్ కలర్లోనే ఉండేవి. ఆ జీపు అద్దం కింద పోలీస్ అని రాసే స్థానంలో తెల్లటి అక్షరాలతో "టార్జాన్" అని రాసి ఉంది. జగిత్యాల నుండి బీర్పూర్ వరకు రూ. 150 కిరాయి మాట్లాడుకుని, ాూ×ఖీ 3567 నంబర్ గల ఆ జీపులో మొత్తం 17 మంది ప్రయాణమయ్యారు. తిరుపతిరావు దారుణ హత్య వార్త విని, ఆయనను చివరిసారిగా చూసి కన్నీటి వీడ్కోలు చెప్పడానికి బంధువులంతా ఆ జీపు ఎక్కారు. ఆ జీపులో తిరుపతిరావు కుమార్తె కాకులమర్రి వనజ, అల్లుడు విద్యాసాగర్ రావులతో పాటు వారి పదేళ్ల లోపు పిల్లలైన కొడుకు శశిధర్ రావు, కూతురు సరిత ఉన్నారు. వారితో పాటు తిరుపతిరావు కుమారుడి కూతురైన 8 ఏళ్ల చిన్నారి బేబీ అశ్విని కూడా ఉంది. వారితో పాటు తిరుపతి పుణ్యక్షేత్రం డ్యూటీ ముగించుకొని వచ్చిన ఆర్టీసీ కండక్టర్ వంగపల్లి సత్యనారాయణరావు (ఆర్టీసీ కాకీ డ్రెస్‌లోనే ఉన్నాడు), వంగపల్లి రేణుక, దంపతులైన వంగపల్లి శ్రీరంగారావు-లావణ్య, యాతమనేని వెంకట్రావు-విజయ దంపతులు, సాగి నీరజ, గంద్ర వసంత ప్రయాణిస్తున్నారు. పరామర్శకు వెళ్లేందుకు రేచపల్లి గ్రామానికి చెందిన మోత్కూరి నరసయ్య గౌడ్ కూడా పరుగెత్తుకుంటూ వచ్చి ఆ జీపు ఎక్కాడు. ప్రయాణికులలో వంగపల్లి రామచంద్రరావు, వంగపల్లి మురళీధర్ రావు మరియు జీపు డ్రైవర్ కోకిలాల రాజయ్య కూడా ఉన్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులతో భారంగా బీర్పూర్ వైపు కదిలింది ఆ మృత్యు జీపు.

మరోవైపు నక్సల్స్ ఘాట్ రోడ్డు కొండపైన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకున్నారు. పేలుడు ప్రదేశానికి 300 మీటర్ల దూరంలో ఒక సెంట్రీని కాపలా ఉంచారు. కంట్రోల్ రూమ్ వరకు ఒక సన్నటి నూలుతాడు కట్టి, దానికి ఒక చిన్న గంట అమర్చారు. వాహనం రాగానే తాడు లాగితే గంట మోగి, కంట్రోల్ రూమ్‌లో ఉన్నవారికి సైరన్‌లా సంకేతం వెళ్తుంది. దూరం నుంచి పచ్చటి జీపు రావడం.. ముందు సీట్లో కాకీ డ్రెస్‌లో ఉన్న ఆర్టీసీ కండక్టర్ సత్యనారాయణరావు కనిపించడంతో సెంట్రీ అది 'పోలీస్ జీపు' అని పొరబడ్డాడు! వెంటనే నూలుతాడును గట్టిగా లాగాడు. కంట్రోల్ రూమ్‌లో గంట మోగింది! అడవి ఒక్కసారిగా కంపించింది. ఆకాశంలోకి మట్టి, రాళ్లు, ఇనుప ముక్కలు, నిప్పుకణాలు ఎగిసిపడ్డాయి! అమర్చిన 7 మందుపాతరలలో ఒక భారీ ల్యాండ్‌మైన్ విస్ఫోటనం చెందింది. ఆ దెబ్బకు 'టార్జాన్' జీపు సుమారు 30 అడుగుల ఎత్తుకు గాలిలోకి ఎగిరి ముక్కలైపోయింది. ఒక్క క్షణం.. కేక పెట్టే సమయం కూడా దక్కలేదు. రక్తమాంసాల వర్షం కురిసింది. ప్రయాణిస్తున్న 17 మందిలో 13 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, నలుగురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. తిరుపతిరావు కుమార్తె కాకులమర్రి వనజ, అల్లుడు విద్యాసాగర్ రావు, వారి పదేళ్ల లోపు పిల్లలు శశిధర్ రావు, సరిత అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఆ పసిమొగ్గలు రెండూ మంటల్లో మాడిపోయాయి! ఆర్టీసీ కండక్టర్ వంగపల్లి సత్యనారాయణరావు, వంగపల్లి రేణుక, వంగపల్లి శ్రీరంగారావు-లావణ్య దంపతులు, యాతమనేని వెంకట్రావు-విజయ దంపతులు, సాగి నీరజ, గంద్ర వసంత, మోత్కూరి నరసయ్య గౌడ్.. ఇలా మొత్తం 13 మంది అమాయకులు అక్కడికక్కడే గుర్తుపట్టలేని మాంసపు ముద్దలుగా మారిపోయారు. చిత్రమేమిటంటే.. ఉద్యమ నేత గణపతి సొంత బంధువులే ఇందులో ఎక్కువగా బలయ్యారు!

ఈ భయంకర దృశ్యాన్ని కొలువాయికి గ్రామానికి చెందిన శంకర్ లింగం అనే వ్యక్తి బుల్లెట్ బండి పై వెళ్తూ కళ్లారా చూసి, భయంతో వణుకుతూ వెనుతిరిగి బీర్పూర్ గ్రామానికి పరుగెత్తుకొచ్చి అక్కడ విచారణలో ఉన్న సీఐ, డీఎస్పీలకు విషయం చెప్పాడు. అదే సమయంలో ధర్మపురి వైర్‌లెస్ సెట్ నుంచి సమాచారం అందుకున్న సారంగాపూర్ పోలీసులు, బీర్పూర్‌లో ఉన్న డీఎస్పీ వేణుగోపాలకృష్ణ, సీఐ నరసింగరావులను ఘాట్ రోడ్డు వైపు రావద్దని హెచ్చరించారు. కానీ ఆ ప్రమాదకరమైన మెసేజ్‌ను పోలీస్ అధికారులకు చెప్పేందుకు ఎవరూ ధైర్యం చేయలేకపోయారు. అక్కడ ఉన్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరాజ్యం కన్నీళ్లతో పత్రికా విలేకరి సురేందర్ కుమార్ ను వేడుకున్నాడు.. "అయ్యా సురేందర్! నీకు దండం పెడతా.. మా డీఎస్పీ, సీఐలను అటుపోకుండా ఆపవయ్యా!" అని బ్రతిమాలుకున్నాడు. బాధ్యతగల జర్నలిస్టుగా సురేందర్, తన మిత్రుడు మూర్తితో కలిసి వెంటనే టూ వీలర్‌పై సంఘటనా స్థలానికి దూసుకెళ్లారు. అక్కడ అడుగుపెట్టగానే నిశ్శబ్దమే హాహాకారాలు చేసినంత పనైంది! భయంకరమైన నరమేధం.. తెగిపడిన శరీర భాగాలు, చెట్ల కొమ్మలకు దారుణంగా వేలాడుతున్న మానవ మాంసపు ముద్దలు, రోడ్డంతా చెరువులా పారుతున్న నెత్తుటి మడుగులు! గుండెలు అవిసే ఆ ఘోరకలి మధ్య.. మృత్యువు నిశ్శబ్దంలోంచి వాగు పక్క ఇసుక తిన్నెల వైపుగా ఒక పసిపాప దయనీయమైన మూలుగు వినపడింది! జర్నలిస్టు సురేందర్ పరుగెత్తుకుంటూ వెళ్లగా.. అక్కడ 8 ఏళ్ల చిన్నారి బేబీ అశ్విని రక్తసిక్తమై, చెవి నుంచి రక్తం కారుతూ, స్పృహతప్పి మూలుగుతోంది! తన అత్త వనజ పిల్లలిద్దరూ పేలుడులో చనిపోగా.. జీపు పేలిన వేగానికి గాలిలోకి ఎగిరి అదృష్టవశాత్తూ ఇసుకపై పడటంతో అశ్విని ఊపిరి నిలిచింది. ఆ క్షణంలో సురేందర్ వార్తను, కెమెరాను పక్కనపెట్టాడు. "వార్త కంటే ప్రాణమే ముఖ్యం" అని భావించి, వణుకుతున్న చేతులతో ఆ చిన్నారిని గుండెలకు హత్తుకుని రోడ్డుపైకి తీసుకొచ్చాడు. వెంటనే తన మిత్రుడు మూర్తి, మరొకరికి అప్పగించి సుజుకి బైక్‌పై ఆ పాపను ఆసుపత్రికి పంపించి, పసిప్రాణాన్ని కాపాడి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఈ దారుణ ప్రమాదంలో వంగపల్లి రామచంద్రరావు, వంగపల్లి మురళీధర్ రావు, బేబీ అశ్విని మరియు డ్రైవర్ కోకిలాల రాజయ్య తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. కొద్దిసేపటికి తాము చంపింది పోలీసులు కాదని, అమాయక ప్రజలని తెలుసుకున్న నక్సల్స్ కొండ దిగి వచ్చి, ముక్కలైన శవాలను చూసి దిగ్భ్రాంతి చెందారు. "అయ్యో.. మీరా? మేము పోలీసులు అనుకున్నామే.." అంటూ పశ్చాత్తాపంతో తలదించుకున్నారు. కానీ ఆ పశ్చాత్తాపం రాలిన ప్రాణాలను తిరిగి తేలేకపోయింది.

ఈ ఘోరకలి తర్వాత నాటి హోంమంత్రి మాధవరెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించి అశ్రునయనాలతో నివాళులర్పించారు. అమాయక పౌరులపై జరిగిన ఈ దాడి ఉద్యమ సిద్ధాంతాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి బీజం వేసింది. ఆ తర్వాత కాలంలోనే పీపుల్స్ వార్ గ్రూప్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం "గ్రేహౌండ్స్" వంటి ప్రత్యేక బలగాలను రంగంలోకి దించడానికి ఈ హింసాత్మక మలుపే ప్రధాన కారణమైంది. యుద్ధాలకు విజేతలు ఉండొచ్చు.. సిద్ధాంతాలకు వేలాది మంది అనుచరులు ఉండొచ్చు.. కానీ, కళ్లెదుటే మేనత్త కుటుంబాన్ని, తోటి పసిపిల్లలను మృత్యువు కబళించగా.. ఆ చిన్నారి అశ్విని ప్రాణాలతో బయటపడి తన కన్నవారి వద్దకు చేరుకున్నా, ఆ పసి మనస్సుపై పడిన ఆనాటి కాళరాత్రి గాయాన్ని, చెదిరిపోయిన బాల్యపు ప్రశాంతతను తిరిగి ఇవ్వగలిగే శక్తి ఈ ప్రపంచంలో ఏదైనా ఉందా? ఈ రోజుకీ బీర్పూర్ ఘాట్ రోడ్డు గుండా వీచే గాలి ఊపిరి పీల్చుకోవడానికి జడిసిపోతూనే ఉంది. కాలం తన గమనంలో అడవికి పచ్చని చీర కప్పి ఉండవచ్చు, రాళ్ల సందుల్లో కొత్త ఆకులు ఆశగా చిగురించి ఉండవచ్చు.. కానీ, ఆ కల్వర్టు రాళ్ల పొరల్లో, ఆ మట్టి పేగుల్లో ఇప్పటికీ ఒక మూగ రోదన ప్రతిధ్వనిస్తూనే ఉంది! అది కేవలం ఎండిపోయిన రక్తం కాదు.. సిద్ధాంతాల పేరిట మనుషుల ద్వేషం అమాయక ప్రాణాలపై రాసిన ఒక రక్తాసిక్త వినాశన చరిత్ర!

1989 సెప్టెంబర్ 1న బీర్పూర్ ఘాట్ రోడ్డుపై నెత్తుటి వర్షంలో రాలిపోయిన ఆ అమాయకుల రక్తం నేటికీ సమాజాన్ని ఒకటే ప్రశ్న అడుగుతోంది..

"మా తప్పేంటి?"

ఆ ప్రశ్నకు సమాధానం ఏ సిద్ధాంతం దగ్గరా లేదు. సిద్ధాంతాల పేరిట అమాయకుల రక్తం చిందిస్తే గెలిచేది ఎవరూ ఉండరు.. ఓడిపోయేది మాత్రం మానవత్వమే! హింస లేని, ద్వేషం లేని ప్రశాంత సమాజమే ఆ అమాయక ఆత్మలకు మనం ఇచ్చే నిజమైన నివాళి.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
9010128884, సీనియర్ జర్నలిస్ట్

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.